

వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా లలిత్ బొహ్రా



లలిత్ బొహ్రా

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వాల్తేరు రైల్వే డివిజనల్ మేనేజర్‌గా లలిత్ బొహ్రా నియమితులయ్యారు. ఐఆర్ఎస్ అధికారి అయిన బొహ్రా ప్రస్తుతం డిప్యూటేషన్‌పై రెన్యువబుల్ ఎనర్జీ విభాగంలో పనిచేస్తున్నారు. ఇక్కడ డీఆర్ఎంగా పనిచేస్తున్న సౌరబ్ నెల క్రితం ఒక కాంట్రాక్టర్ నుంచి రూ.25 లక్షలు లంచం తీసుకుంటూ ముంబైలో సీబీఐకి పట్టుబడిన విషయం తెలిసిందే. దాంతో ఆయన్ను సస్పెండ్ చేశారు. ప్రస్తుతం ఇన్‌చార్జి డీఆర్ఎంగా సాహూ వ్యవహరిస్తున్నారు.

భూ కబ్జాదారుల్లో వణుకు

రెవెన్యూ సదస్సుల్లో వైసీపీ నేతలపై పెద్ద ఎత్తున ఫిర్యాదులు

- 22ఏ జాబితాలోని భూములు అన్యాక్రాంతం
- అధికారులపై ఒత్తిడి తెచ్చి వెబ్‌ల్యాండ్‌లో తమ పేరున నమోదు
- రెవెన్యూ సదస్సుల్లో వెలుగుచూస్తున్న అక్రమాలు
- వైసీపీ నేతలకు సహకరించిన అధికారుల్లో గుబులు



కె.కోటపాడు మండలం ఎ.భీమవరంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మహిళ నుంచి అర్జీ స్వీకరిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్, ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి (ఫైల్ ఫొటో)

(అనకాపల్లి- ఆంధ్రజ్యోతి)

ప్రభుత్వ భూములు కాజేసిన ఆక్రమణదారుల్లో ఆందోళన మొదలైంది. రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు గత ఐదేళ్లలో సాగించిన భూదందాలపై కూటమి ప్రభుత్వం దృష్టి సారించిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా రెవెన్యూ అధికారులు అన్ని గ్రామ పంచాయతీల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహిస్తూ బాధితుల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్నారు. జనవరి 8వ తేదీతో రెవెన్యూ సదస్సులు పూర్తవుతాయి. ప్రభుత్వ, దేవదాయ భూములతోపాటు ప్రైవేటు వ్యక్తుల జిరాయితీ భూములను అక్రమంగా కైవసం చేసుకున్న వైసీపీ నేతలపై పెద్ద ఎత్తులు ఫిర్యాదులు అందుతున్నాయి. దీంతో భూ కబ్జాదారులు, వారికి సహకరించిన అధికారులకు భయం పట్టుకుంది.

గత వైసీపీ ప్రభుత్వం భూముల సమగ్ర రీసర్వే పేరుతో ప్రభుత్వ ప్రైవేటు భూములను ఇష్టారాజ్యంగా సర్వే చేసింది. కొంతమంది వైసీపీ నాయకులు, ప్రభుత్వ అధికారులపై ఒత్తిడి చేసి రీసర్వే ముసుగులో 22ఏ జాబితాలో వున్న ప్రభుత్వ భూములను తమ పేరున, బంధువుల పేరున రికార్డుల్లో నమోదు చేయించుకున్నారు. కొన్నిచోట్ల జిరాయితీ భూములను సైతం తమ వశం చేసుకున్నారు. ఇందుకు రెవెన్యూ, సర్వే విభాగాల అధికారులు సహకరించినట్టు ఆరోపణలు వచ్చాయి. అనకాపల్లి మండలంలో ఏడు గ్రామాల్లో ల్యాండ్ పూలింగ్ పేరుతో సుమారు 900 ఎకరాల భూములను అప్పటి వైసీపీ ప్రభుత్వం రైతుల నుంచి తీసుకుంది. అయితే వైసీపీ నాయకుల బినామీ పేర్లను జాబితాలో చేర్చి వీఎంఆర్‌డీఏ నుంచి పరిహారంగా నివాస స్థలాలను పొందినట్టు అధికారులకు ఫిర్యాదులు అందాయి. కశింకోట మండలం విస్సన్నపేటలో వందలాది ఎకరాల ప్రభుత్వ భూములను జిల్లాకు చెందిన ఒక మంత్రి (ఇప్పుడు మాజీ) అనుచరులు కబ్జా చేసి లేఅవుట్ వేస్తున్నట్టు ఫిర్యాదులు వచ్చాయి. అచ్యుతాపురం మండలం దొప్పెర్ల గ్రామ రెవెన్యూ పరిధిలో సర్వే నంబరు 41, 49, 50, 51ల్లో 22ఏ జాబితాలో వున్న 23 ఎకరాల ప్రభుత్వ భూములను వైసీపీ నాయకులు, అధికారులపై ఒత్తిడి తెచ్చి నిషేధిత జాబితా నుంచి తొలగించుకున్నారు. దీనిపై గ్రామస్థులు రెవెన్యూ సదస్సులో ఫిర్యాదు చేశారు.

భూ ఆక్రమణలపై వెయ్యికి పైగా ఫిర్యాదులు

జిల్లాలో 710 రెవెన్యూ గ్రామాలు వుండగా ఇప్పటి వరకు 323 గ్రామాల్లో రెవెన్యూ సదస్సులు నిర్వహించారు. ప్రజల నుంచి 17,055 ఫిర్యాదులు/ అర్జీలు అందాయి. వీటిలో వెయ్యికిపైగా ఫిర్యాదులు వైసీపీ నాయకుల భూదందాలకు సంబంధించినవి వున్నట్టు సమాచారం. వీటిలో అత్యధిక శాతం 22ఏ నిషేధిత జాబితాలో వున్న ప్రభుత్వ భూములని తెలిసింది. మిగిలినవి పట్టాదారు పాసుపుస్తకాలు జారీ, వెబ్‌ల్యాండ్‌లో పేర్లు మార్పు, విస్తీర్ణం తప్పుగా నమోదు అయినవి వున్నాయి. రీసర్వేలో తమ భూములను తక్కువగా చూపి రికార్డుల్లో నమోదు చేశారని, వాటిని సరిదిద్దాలని ఎక్కువ మంది అర్జీలు పెట్టుకుంటున్నారు. కాగా వైసీపీ నాయకుల భూదందాలపై ఫిర్యాదులు అందుతుండడంతో ఆ పార్టీ నేతలు ఆందోళన చెందుతున్నారు. అప్పట్లో వీరికి సహకరించిన రెవెన్యూ అధికారుల్లో వణుకు మొదలైంది. రెవెన్యూ సదస్సుల్లో అందిన ఫిర్యాదులపై విచారణ జరిపి కబ్జాకు గురైన ప్రభుత్వ భూములను తిరిగి స్వాధీనం చేసుకుంటుందా? అంతటితో ఆగకుండా క్రిమినల్ చర్యలకు కూడా దిగుతుందా? అని ఆక్రమణదారులు గుబులు చెందుతున్నారు.

అడ్డగోలుగా లేఅవుట్

అనుమతులు లేకుండా వ్యవసాయ భూమిలో వెంచర్

- పక్కనే వున్న జాతీయ రహదారి సర్వీసు రోడ్డు కబ్జా
- హైటెన్షన్ విద్యుత్ లైన్ల కిందా ఇళ్ల స్థలాలు
- ఫిర్యాదులు అందినా పట్టించుకోని అధికారులు



జాతీయ రహదారి సర్వీసు రోడ్డులో నుంచి రియల్ ఎస్టేట్ వెంచర్‌లోకి వెళుతున్న లారీ

(అనకాపల్లి-ఆంధ్రజ్యోతి)

జిల్లా కేంద్రం అనకాపల్లి, పరిసరాల్లో భూముల ధరలు గణనీయంగా పెరుగుతుం డడంతో ప్రభుత్వ భూములు, స్థలాల ఆక్రమణలు నానాటికీ అధికం అవుతున్నాయి. రాజకీయ పార్టీల నేతల నేతల కనుసన్నల్లో కబ్జాదారులు బరితెగిస్తున్నారు. మరోవైపు వ్యసాయ భూములకు 'నాలా' పన్ను చెల్లించకుండానే లేఅవుట్‌లు వేసి ప్లాట్లు అమ్మేస్తున్నారు. రియల్టర్లు మరో అడుగు ముందుకు రహదారులను, సర్వీసు రోడ్లను కబ్జా చేస్తున్నారు.



సింహాద్రి ఎన్‌టీపీసీ హైటెన్షన్ విద్యుత్ లైన్ల కింద మట్టి, రాళ్ల కుప్పలు

అనకాపల్లికి చెందిన ఒక రియల్ ఎస్టేట్ వ్యాపారి మహా విశాఖ నగరపాలక సంస్థ (జీవీఎంసీ) అనకాపల్లి జోన్ పరిధిలోని కొప్పాక రైల్వే వంతెనకు సమీపంలో జాతీయ రహదారికి సమీపంలో ఎటువంటి అనుమతులు పొందకుండా వ్యవసాయ భూముల్లో భారీ వెంచర్ వేస్తున్నారు. వ్యవసాయ భూములను వ్యవసాయేతర అవసరాలకు వినియోగించుకోవాలంటే సంబంధిత శాఖల నుంచి అనుమతులు తీసుకుని, 'నాలా' పన్ను చెల్లించాలి. కానీ ఇక్కడ వెంచర్ వేస్తున్న రియల్ ఎస్టేట్ వ్యాపారి 'నాలా' పన్ను చెల్లించలేదు. దీనిపై జీవీఎంసీ, రెవెన్యూ, వీఎంఆర్‌డీఏ అధికారులతోపాటు కలెక్టర్‌కు ఫిర్యాదులు అందాయి. కానీ ఇంతవరకు ఏ ఒక్క విభాగం అధికారి కూడా పట్టించుకోలేదు. 'నాలా' పన్ను చెల్లింపు గురించి కూడా నోటీసులు జారీ చేయలేదు. దీంతో సదరు రియల్ ఎస్టేట్ వ్యాపారి మరో అడుగు ముందుకేశారు. లేఅవుట్‌కు సమీపంలో జాతీయ రహదారికి ఆనుకొనివున్న (రైల్వే వంతెనకు సమీపంలో) సర్వీసు రోడ్డు ఆక్రమించేశారు. లేఅవుట్‌లోకి మట్టి, గ్రావెల్, ఇతర సామగ్రిని తరలించడానికి దీనిని వినియోగించుకుంటున్నారు. అంతేకాకుండా ఇతరులు ఎవరూ లోపలికి రాకుండా బండరాళ్లను, మట్టిని రోడ్డుకు అడ్డంగా వేయించారు.

ఇదిలావుండగా అనధికార లేఅవుట్ మీదుగా పరవాడ సింహాద్రి ఎన్‌టీపీసీకి చెందిన హైటెన్షన్ విద్యుత్ లైన్లు వెళుతున్నాయి. వాస్తవానికి రైతులు గతంలో విద్యుత్ లైన్ల కింద, టవర్ల వద్ద భూమిని ఎన్‌టీపీసీకి అప్పగించి పరిహారం పొందారు. ఎన్‌టీపీసీకి చెందిన ఈ స్థలంలో ఎటువంటి నిర్మాణాలు చేపట్టకూడదు. కానీ కానీ రియల్ ఎస్టేట్ వ్యాపారి విద్యుత్ లైన్ల కింద మట్టిని తోలి లేఅవుట్ వేస్తున్నారు. అయినాసరే సంబంధిత శాఖల అధికారులు ఎవరూ పట్టించుకోవడంలేదు.



గర్భిణిని డోలీలో మోసుకొస్తున్న కుటుంబ సభ్యులు

మైదాన ప్రాంతంలోనూ డోలీ మోతలు!

- గర్భిణిని ఆస్పత్రికి తీసుకెళ్లడానికి అవస్థలు

మాడుగుల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని జాలంపల్లి పంచాయతీ శివారు సిరిపురం గిరిజన గ్రామానికి కనీస రోడ్డు సదుపాయం లేకపోవడంతో ఆదివాసీలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. తీవ్ర అనారోగ్యానికి గురైన వారిని, పురిటి నొప్పులు వచ్చిన వారిని ఆస్పత్రికి తీసుకెళ్లాలంటే డోలీ కట్టాల్సిందే. గ్రామానికి చెందిన చదల వెంకటలక్ష్మి అనే గర్భిణికి బుధవారం రాత్రి ఏడు గంటల సమయంలో పురిటినొప్పులు వచ్చాయి. రహదారి బురదగా వుండడంతో ఆటోలు, అంబులెన్స్ గ్రామానికి వచ్చే పరిస్థితి లేదు. దీంతో కుటుంబ సభ్యులు డోలీ కట్టి, వర్షంలో తడుస్తూ ... మిగతా 8వ పేజీలో

అడుగడుగునా గోతులే!

అధ్వానంగా రావికమతం-కన్నూరుపాలెం రోడ్డు

- వంద గ్రామాల ప్రజలకు నిత్యం కష్టాలే
- 20 కి.మీ. దూరం.. గంటకుపైగా ప్రయాణం
- గోతులైనా పూడ్చాలని ప్రజలు వినతి
- రూ.3 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపినట్టు ఆర్‌అండ్‌బీ జేఈ వెల్లడి



గుడ్డిప సమీపంలో గోతులమయంగా మారిన రహదారి

రావికమతం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):

మూడు మండలాలకు చెందిన దాదాపు వంద గ్రామాల ప్రజలు రాకపోకలు సాగించే రావికమతం-ఈశ్వర కన్నూరుపాలెం (ఆర్ఈసీ) రోడ్డు భారీ గోతులతో అధ్వానంగా వుంది. కొద్ది రోజుల నుంచి కురుస్తున్న వర్షాలతో పరిస్థితి మరింత దారుణంగా తయారైంది. గోతుల్లో నీరు నిలిచిపోయి కుంటలను తలపిస్తున్నాయి. రాత్రిపూట ఈ మార్గంలో ప్రయాణించే ద్విచక్ర వాహనదారులు ప్రమాదాలకు గురతున్నారు. ఆర్ఈసీ రోడ్డులో వాహనాలు పాడైపోతున్నాయని ఆటో డ్రైవర్లు, ద్విచక్ర వాహనదారులు వాపోతున్నారు.



పిల్లవానిపాలెంలో గోతులు ఏర్పడి ఛిద్రమైన రోడ్డు

రావికమతం నుంచి తట్టబంద, తోటకూరపాలెం, కశింకోట మండలం చెరకాం మీదుగా కన్నూరుపాలెం (తాళ్లపాలెం-నర్సీపట్నం రోడ్డులో కలుస్తుంది) వరకు ఉన్న సుమారు 20 కిలోమీటర్ల రోడ్డు ఆర్‌అండ్‌బీ పరిధిలో వుంది. రావికమతం, బుచ్చెయ్యపేట, కశింకోట, మాకవరపాలెం మండలాలకు చెందిన దాదాపు వంద గ్రామాల ప్రజలు జిల్లా కేంద్రం అనకాపల్లితోపాటు జాతీయ రహదారిపై ఎలమంచిలి, తుని వైపు వెళ్లడానికి ఈ మార్గంలో నుంచే రాకపోకలు సాగిస్తుంటారు. ఇటు తోటకూరపాలెం- రావికమతం మధ్యలో వున్న గ్రామాల ప్రజలు వివిధ పనుల నిమిత్తం మండల కేంద్రానికి వచ్చిపోతుంటారు. కాగా రెండు దశాబ్దాల క్రితం వరకు ఇది మెటల్ రోడ్డుగా ... మిగతా 8వ పేజీలో

ఎస్సీ కుల గణన జాబితాలు విడుదల

పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో అందుబాటులో

31వ తేదీ వరకు అభ్యంతరాల స్వీకరణ

జనవరి ఆరో తేదీలోగా నిర్ణయం, 10న తుది జాబితా విడుదల



పాయకరావుపేట సచివాలయం నోటీసు బోర్డులో ఎస్సీ కుల గణన జాబితాను చూపుతున్న ఇన్‌చార్జి ఎంపీడీఓ

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో షెడ్యూల్డు కులాల (ఎస్సీ) గణనకు సంబంధించిన జాబితాలను విడుదల చేసినట్టు కలెక్టర్ విజయకృష్ణన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ జాబితాలు అన్ని పంచాయతీ కార్యాలయాలు, గ్రామ/ వార్డు సచివాలయాల్లో అందుబాటులో వుంటాయని వెల్లడించారు. ఎస్సీ కుల గణనపై ఈ నెల 31వ తేదీ వరకు సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని చెప్పారు. పేరు, ఆధార్ నంబరు, పుట్టిన తేదీ, వయసు, ఉప కులం, మరుగుదొడ్డి సౌకర్యం, తాగునీటి సౌకర్యం, విద్యార్హత, వృత్తి, ఇతర వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ డేటాపై అభ్యంతరాలను వీఆర్వోలు స్వీకరిస్తారని, వీటిని మూడు దశల్లో తనిఖీ చేస్తారని తెలిపారు. పౌరుల నుంచి వచ్చిన అభ్యంతరాలను వీఆర్వో పరిశీలించి వివరాలను సంబంధిత రెవెన్యూ అధికారికి నివేదిస్తారని ఆమె చెప్పారు. వీటిని పునఃపరిశీలించి తహసీల్దార్‌కు సిఫారసు చేస్తారని, తహసీల్దార్ పరిశీలించి తుది ఆమోదం తెలిపిన తరువాత వివరాలను పోర్టల్లో పొందుపరుస్తారని వివరించారు. సోషల్ ఆడిట్‌పై ఈ నెల 31వ తేదీ వరకు అభ్యంతరాలు స్వీకరిస్తామని, ప్రజల నుంచి అందిన అభ్యంతరాలపై వచ్చే ఏడాది జనవరి ఆరో తేదీలోగా నిర్ణయం తీసుకుంటామని వెల్లడించారు. కులగణన తుది వివరాలతో జనవరి 10వ తేదీన జాబితాను విడుదల చేస్తామన్నారు. ఆమె చెప్పారు.

స్తంభించిన నిత్యావసరాల వ్యాపారం

కూలి రేట్లు 50 శాతం పెంచాలని ముఠా కార్మికులు సమ్మె నోటీసు

- 13 శాతానికి మించి పెంచలేమన్న వ్యాపారులు
- దుకాణాలు మూసివేసి నిరసన
- అధికారులకు వినతిపత్రాలు



బండిగాడివీధిలో మూసివేసిన దుకాణాలు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): హమాలీ చార్జీలు పెంచాలని డిమాండ్ చేస్తూ ముఠా కార్మికులు సమ్మెకు దిగడం, వాళ్ల (కార్మికులు) అడిగింత పెంచలేమని వ్యాపారులు స్వచ్ఛందంగా బంద్ పాటించడంతో గురువారం అనకాపల్లి పట్టణంలో నిత్యావసర సరకుల వ్యాపారం స్తంభించింది. ఈ సందర్భంగా కిరాణా హోల్‌సేల్, రిటైల్ వ్యాపారులు దుకాణాలను మూసివేసి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లారు. డీఆర్ఓ, ఆర్డీవోలను కలిసి వినతిపత్రాలు అందించారు. ఈ సందర్భంగా వర్తక సంఘాల ప్రతినిధులు శ్రీధరాల సోమరాజు, బొడ్డేడ శంకరరావు, గుండా సాయి మాట్లాడుతూ, ప్రస్తుతం ఇస్తున్న కూలి రేట్లను 50 శాతం పెంచాలని ముఠా కార్మికులు ఇటీవల సమ్మె నోటీసు ఇచ్చారని, కానీ ఇప్పుడు ఇస్తున్న రేట్లపై 13 శాతం పెంచుతామని చెప్పామన్నారు. ఇందుకు కార్మికులు అంగీకరించకుండా సమ్మెకు దిగారని అన్నారు. దీంతో వివిధ వర్తక సంఘాల పరిధిలో వున్న మొత్తం 165 దుకాణాలను మూసివేయాలని నిర్ణయించున్నట్టు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఆయా వర్తకసంఘాల ప్రతినిధులు బి.సత్యనారాయణ, కె.లక్ష్మీజీ, బీవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

జనవరి 31 నుంచి అరకు ఉత్సవాలు

- మారేడుమిల్లి ఉత్సవాలు ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో..
- అల్లూరి జిల్లా కలెక్టర్ దినేశ్‌కుమార్ వెల్లడి



మాట్లాడుతున్న కలెక్టర్ దినేశ్‌కుమార్

పాడేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జనవరి, ఫిబ్రవరి నెలల్లో అరకు, మారేడుమిల్లి ఉత్సవాలను నిర్వహిస్తామని కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్ తెలిపారు. కలెక్టరేట్‌లో పర్యాటక ఉత్సవాలపై గురువారం అధికారులతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. జనవరి 31, ఫిబ్రవరి 1, 2 తేదీల్లో అరకులోయ ఉత్సవాలు, ఫిబ్రవరి 23, 24, 25 తేదీల్లో మారేడుమిల్లి ఉత్సవాలు నిర్వహించేందుకు అధికారులు ఏర్పాట్లు చేయాలన్నారు. ఈ రెండు ఉత్సవాలను నిర్వహించేందుకు రూ.3 కోట్ల చొప్పున మొత్తం రూ.6 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని కలెక్టర్ తెలిపారు. అరకులోయ పట్టణాన్ని విద్యుత్ దీపాలతో సుందరంగా తీర్చిదిద్దాలని, ఉత్సవం జరిగే ప్రాంగణంలో వివిధ రకాల స్టాళ్లను ఏర్పాటు చేయాలని, మూడు రోజులపాటు పలు రకాల సాంస్కృతిక కార్యక్రమాలు, గిరిజన కళాకారుల సంప్రదాయ ప్రదర్శనలు ఏర్పాటు చేయాలన్నారు. మారథాన్, చిత్రలేఖనం, రంగోలి, కాఫీ రుచుల పోటీలు, గులాబీల ప్రదర్శన, హాట్ ఎయిర్ బెలూన్ షో వంటివి నిర్వహించాలని ... మిగతా 8వ పేజీలో

నేడు ఉద్దండపురానికి హోం మంత్రి రాక


ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఏవో ఉమాప్రసాద్, టీడీపీ నాయకులు

నక్కపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దండపురంలో హోం మంత్రి వంగలపూడి అనిత శుక్రవారం పర్యటించనున్నారు. గ్రామంలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆమె ప్రారంభిస్తారు. అనంతరం రైతులతో ముఖాముఖి కార్యక్రమంలో పాల్గొంటారు. ఈమేరకు గురువారం ఏవో ఉమాప్రసాద్, టీడీపీ మండల అధ్యక్షుడు కొప్పిశెట్టి వెంకటేశ్, టీడీపీ నాయకులు వైబోయిన రమణ, నానేపల్లి రాఘవులు, పొడగట్ల రమణ ఏర్పాట్లు పరిశీలించారు.

పెండింగ్ కేసులపై డీఎస్పీ ఆరా


సీఐ, ఎస్ఐతో మాట్లాడుతున్న డీఎస్పీ మోహన్

నక్కపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక సర్కిల్ పరిధిలో పాత కేసులపై నర్సీపట్నం డీఎస్పీ జీఆర్ఆర్ మోహన్ ఆరా తీశారు. గురువారం స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆయన తనిఖీ చేశారు. సర్కిల్ పరిధిలో పెండింగ్‌లో వున్న కేసుల గురించి సీఐ కుమారస్వామి, ఎస్ఐ సన్నిబాబుతో మాట్లాడారు. పోలీస్ స్టేషన్ రికార్డులను పరిశీలించి, సంతృప్తి వ్యక్తం చేశారు. డిసెంబరు 31 సమీపిస్తున్నందున రోడ్డు ప్రమాదాల నివారణకు ముమ్మరంగా డ్రంక్ అండ్ డ్రైవ్ పరీక్షలు చేయాలని ఆదేశించారు. మద్యం సేవించి కొందరు యువకులు అతివేగంగా బైక్‌లు నడుపుతూ ప్రమాదాలకు గురవుతున్నారన్నారు. అదేవిధంగా సంక్రాంతి సందర్భంగా చట్టవ్యతిరేక కార్యకలాపాలు, పేకాట, కోడిపందాలు, గుళ్లాటలు, పొట్టేలు పోటీలు జరగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. అనంతరం పోలీస్‌స్టేషన్‌లో వున్న సిబ్బందితో ఆయన మాట్లాడి పలు సూచనలు చేశారు.

ఎస్సీ జనాభా జాబితాల ప్రదర్శన

పాయకరావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో ఎస్సీ సామాజిక జనాభా జాబితాలను గురువారం అన్ని పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల నోటీసు బోర్డుల్లో ప్రదర్శనగా పెట్టారు. ఈ సందర్భంగా ఇన్‌చార్జి ఎంపీడీఓ సీహెచ్ఆర్‌కే.వర్మ మాట్లాడుతూ మండలంలోని 24 పంచాయతీల్లో ఎస్సీ సామాజికవర్గం జనాభా లెక్కింపుపై సర్వే చేయడం జరిగిందన్నారు. ఈ జాబితాలపై అభ్యంతరాలుంటే ఈనెలాఖరులోగా పంచాయతీ కార్యాలయాలు, సచివాలయాల్లో లిఖితపూర్వకంగా తెలియజేయాలన్నారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ఈఓపీఆర్డీ వైవీ.సత్యనారాయణ పాల్గొన్నారు.

సంపద కేంద్రాలతో పంచాయతీలకు ఆదాయం

నక్కపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో సంపద కేంద్రాలను సమర్థవంతంగా నిర్వహిస్తే పంచాయతీలకు అదనపు ఆదాయం లభిస్తోందని ఎంపీడీవో డి. సీతారామరాజు అన్నారు. మండలంలోని చినదొడ్డిగల్లు సచివాలయాన్ని ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సంపద కేంద్రాల్లో సేంద్రియ ఎరువుల తయారీని పెంచాలన్నారు. సచివాలయ సిబ్బంది హాజరు, ఈ సర్వీసెస్, తదితర అంశాలపై సచివాలయ సిబ్బందికి సూచనలు చేశారు. ఇందులో వైస్ ఎంపీపీ వెలగా ఈశ్వరరావు, ఈవోపీఆర్‌డీ శ్రీనివాస్, సెక్రటరీలు రాజశేఖర్, సత్యనారాయణ పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ


విద్యార్థినులకు స్టడీ మెటీరియల్ పంపిణీ చేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక జడ్పీ బాలికోన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థినులకు సత్యసాయి భజన మండలి ఆధ్వర్యంలో గురువారం స్టడీ మెటీరియల్ పంపిణీచేశారు. పాఠశాలలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి కన్వీనర్ పి.రమేష్‌బాబు, యల్.యజ్ఞవల్క్యశర్మ తదితరులు పాఠశాలలో 94 మంది విద్యార్థినులకు స్టడీమెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో హెచ్ఎంలు డి.భావానీ, కోడి నానాజీ, ఎం.శ్రీనివాసరావు,సత్యసాయి భజన మండలి సభ్యులు లక్ష్మీపతిరాజు, అప్పారావు, సుబ్బారావు, సాయికుమారి, కె.సుధ, ఎల్.జ్యోత్స్నపాల్గొన్నారు.

ఘనంగా సీపీఐ శత వార్షికోత్సవం


సత్యవరంలో నినాదాలు చేస్తున్న సీపీఐ నాయకులు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 25 (ఆంధ్రజ్యోతి): భారత కమ్యూనిస్టు పార్టీ(సీపీఐ) శత వార్షికోత్సవాన్ని గురువారం మండలంలోని సత్యవరంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ పతాకాన్ని నాయకులు ఆవిష్కరించారు. అనంతరం పార్టీ సీనియర్ నాయకులు అనకాపల్లి కార్యవర్గ సభ్యులు రావు జగ్గారావు మాట్లాడుతూ పార్టీ వందేళ్ల ఉద్యమంలో అనేక ప్రజా సమస్యలపై పోరాటం చేసిందన్నారు. కార్యక్రమంలో ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు వెలుగుల అర్జునరావు, ఏపీ మహిళా సమాఖ్య అధ్యక్షురాలు బందుల సుబ్బలక్ష్మి, డీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు వడలి శివప్రకాశ్, సీపీఐ నాయకులు రౌతు రామచంద్ర, గోళ్ల విశ్వేశ్వరరావు, తమ్మయ్యరాజు పాల్గొన్నారు.

అచ్యుతాపురంలో వీర్ బల్ దివస్

అచ్యుతాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): బానిసత్వ మనస్తత్వం నుంచి దేశానికి విముక్తి కలిగిన అమృతకాల్‌ని వీర్ బల్ దివస్‌గా జరుపుకుంటున్నామని బీజేపీ మండల అధ్యక్షుడు కూండ్రపు నాయుడు బాబు అన్నారు. గురువారం మండల పార్టీ కార్యాలయంలో నిర్వహించిన వీర్ బల్ దివస్‌లో ఆయన మాట్లాడుతూ గురుగోవింద్ సింగ్ కుమారులు సాహిబ్‌జాదా బాబా, జోరావర్ సింగ్, బాబా పతేసింగ్‌ల ఆత్మ బలిదానాలు మరువలేమన్నారు. ఈ కార్యక్రమంలో సీరా చిరంజీవి, మట్టా నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

పైసలిస్తే గాని పనులు చేయని కార్యదర్శులు

- మండల సమావేశంలో సభ్యుల ఆరోపణ
- అనారోగ్యం అంటూ ఎంపీడీఓ సమావేశానికి డుమ్మా


సమావేశంలో మాట్లాడుతున్న ప్రగడ నాగేశ్వరరావు

అచ్యుతాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రతి పనికి డబ్బులిస్తే గాని పంచాయతీ కార్యదర్శులు పనిచేయడం లేదని మండల సర్వసభ్య సమావేశంలో పలువురు సభ్యులు ఆరోపించారు. గురువారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ కోన సంధ్య అధ్యక్షతన జరిగిన మండల సమావేశంలో పలువురు సభ్యులు మాట్లాడుతూ ఏ చిన్న పని కావాలన్నా కార్యదర్శులకు ఎంతో కొంత ఇస్తే గాని పనిచేయడం లేదని ఎంపీటీసీ సభ్యుడు నర్మాల కుమార్ ఆరోపించారు. తమ పంచాయతీ పరిధిలో కూడా కార్యదర్శులు ఇదే విధంగా ఉన్నారని సభ దృష్టికి తెచ్చారు. అదే విధంగా రెవెన్యూ కార్యాలయంలో కూడా డబ్బులిస్తే తప్ప పనులు జరగడం లేదన్నారు. సెజ్ పునరావాస కాలనీలో లోవోల్టేజి సమస్యపై అధికారులకు ఎన్ని సార్లు ఫిర్యాదు చేసినా పట్టించుకోవడం లేదని దిబ్బపాలెం సర్పంచ్ నీరుకొండ నర్సింగరావు అన్నారు. సమావేశానికి ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ గైర్హాజర్ కావడం పట్ల ఆయన అసహనం వ్యక్తం చేశారు. మండల సమావేశంలో మినిట్స్ నమోదు చేయాల్సిన ఎంపీడీఓ ప్రభాకరరావు సమావేశానికి రాకపోవడం పట్ల ముఖ్యఅతిథిగా హాజరైన రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. సమావేశం జరుగుతున్నంతసేపు ఎంపీడీఓ ప్రభాకరరావు తన గదిలోనే ఉన్నారు. సమావేశానికి ఎందుకు రాలేదని అడిగితే ఆరోగ్యం బాగాలేదని సమాధానమిచ్చారు. ఇటీవల వర్షాలకు ఎంత పంట నష్టం జరిగిందో తెలియజేయాలని ప్రగడ నాగేశ్వరరావు అధికారులను అడిగారు. మండలంలో 300 ఎకరాల్లో వరి పంట నష్టం వాటిల్లిందని వ్యవసాయ శాఖాధికారులు ప్రకటించగా.. అంతకంటే ఎక్కువ పంట నష్టం జరిగినట్టు తన దృష్టికి వచ్చిందని, మరోసారి పంటనష్టం అంచనాలు వేయాలని ప్రగడ సూచించారు. సమావేశంలో జెడ్‌పీటీసీ సభ్యుడు లాలం రాంబాబు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, అధికారులు పాల్గొన్నారు.

ప్రగడ పాల్గొనడంపై పెదవివిరుపు

మండల సమావేశంలో రాష్ట్ర రహదారుల అభివృద్ధి కార్పొరేషన్ చైర్మన్ ప్రగడ నాగేశ్వరరావు పాల్గొనడంపై ప్రతిపక్ష వైసీపీ సభ్యులు పెదవి విరుస్తున్నారు. సమావేశంలో సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, కోఆప్షన్ సభ్యులతో పాటు అధికారులు పాల్గొనవచ్చు. ఇతరులతోపాటు సభ్యుల భర్తలు, బంధువులు, నామినేటెడ్ పదవి ఉన్న వారు పాల్గొనకూడదు. కాని ప్రగడ నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొనడంపై సమావేశం అనంతరం సభ్యులు అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇలా అయితే భవిష్యత్‌లో మహిళా సభ్యుల భర్తలతో పాటు బంధువులను కూడా అనుమతించేలా వచ్చే సమావేశంలో తీర్మానం చేయాలని వీరంటున్నారు.

కనకమ్మ దర్శనానికి పోటెత్తిన భక్తులు

నేడు ఆలయంలో లక్ష పసుపు కొమ్ముల పూజ


కనకమహాలక్ష్మి అమ్మవారి దర్శనాన్ని బారులు తీరిన భక్తులు

ఎలమంచిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ధర్మవరం కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయానికి గురువారం భక్తులు పోటెత్తారు. ఆలయ ఆవరణ భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజాము నుంచి అమ్మవారికి ప్రత్యేక కుంకుమ పూజా కార్యక్రమాలు, అభిషేకాలు నిర్వహించారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ఆవరణలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ఉత్సవ కమిటీ ప్రతినిధులు కొఠారు సాంబ, ఆధ్వర్యంలో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. అమ్మవారి ఆలయంలో శుక్రవారం ఉదయం నుంచి లక్ష పసుపు కొమ్ముల పూజా కార్యక్రమాన్ని నిర్వహించేందుకు కమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు చేశారు.

ఎస్.రాయవరంలో..

మార్గశిరమాసం సందర్భంగా గురువారం మండలంలోని కర్రివానిపాలెంలో కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో కుంకుమ పూజలు నిర్వహించారు. భక్తులకు కమిటీ సభ్యులు ప్రసాద వితరణ చేపట్టారు. మధ్యాహ్నం ఏర్పాటు చేసిన అన్నసమారాధనలో అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కె.వరహాలరావు, మాజీసర్పంచ్ పి. సూర్యనారాయణ, ఉపసర్పంచ్ కె.నాగు, టీడీపీ నేత కె.అప్పారావు, జనసేన నాయకులు పాల్గొన్నారు.

నేవీ ప్రహరీ పనులు అడ్డుకున్న కొప్పగొండుపాలెం గ్రామస్థులు



రాంబిల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొప్పగొండుపాలెంలో కొండ చుట్టూ నేవీ అధికారులు నిర్మిస్తున్న ప్రహరీ పనులను గురువారం గ్రామస్థులు అడ్డుకున్నారు. ఈ గోడ నిర్మాణంతో తమ ఉపాధి పోయిందని వారు నిరసన వ్యక్తం చేశారు. గతంలో వాడనర్సాపురం, కొత్తపట్నం గ్రామాలకు ఇచ్చిన విధంగా తమ గ్రామంలోని అర్హులకు లైవ్‌లీవుడ్ ప్యాకేజీ ఇస్తామని అధికారులు చెప్పి మినిట్స్‌లో రాశారన్నారు. అలాగే వ్యవసాయ పొలాల్లోకి వెళ్లేందుకు దారి, రుద్రభూమి సదుపాయం, గ్రామస్తులకు ఉపాధి కల్పిస్తామని చెప్పారని, కాని నేటికీ ఏ ఒక్కటి పరిష్కరించలేదని గ్రామస్థులు ఆరోపించారు. తమ సమస్యలు పరిష్కరించేంతవరకు ప్రహరీ పనులు అడ్డుకుంటామని వారు ప్రకటించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బి.హరి, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు పప్పల నూకన్నదొర, గ్రామస్థులు పాల్గొన్నారు.

నిరసన వ్యక్తం చేస్తున్న కొప్పగొండుపాలెం గ్రామస్థులు

వంగవీటి రంగాకు ఘన నివాళి


పాయకరావుపేటలో వంగవీటి మోహనరంగా విగ్రహానికి పూలమాల వేస్తున్న దృశ్యం

పాయకరావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని పట్టణంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక జీవీఆర్ నగర్ వద్ద ఉన్న వంగవీటి మోహనరంగా విగ్రహానికి జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ తోట నగేశ్ తదితరులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా తోట నగేశ్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగా పేదల అభివృద్ధికి ఎంతో కృషి చేశారన్నారు. అనంతరం కాపునాడు మండల అధ్యక్షుడిగా కొమిరాల నాగార్జునను నియమిస్తున్నట్టు కాపునాడు రాష్ట్ర ఉపాధ్యక్షుడు జగతా శ్రీనివాస్ ప్రకటించారు. ఈ కార్యక్రమంలో గూటూరు రామగోవిందు, దేవవరపు ఆనంద్, మద్దూరి సూర్యప్రకాష్, గంట అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

పాయకరావుపేట రూరల్‌లో..

మండలంలోని గుంటపల్లి, అరట్లకోట, పాల్తేరు గ్రామాలలో గురువారం వంగవీటి మోహనరంగా 36వ వర్ధంతిని ఘనంగా నిర్వహించారు. గుంటపల్లిలో వంగవీటి మోహన రంగా విగ్రహానికి నేషనల్ రైఫిల్ షూటర్ గెడ్డం ఆకాశ్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆకాశ్ మాట్లాడుతూ వంగవీటి మోహనరంగ ఒక కులానికి, ఒక మతానికి నాయకుడు కాదని, బడుగు, బలహీన వర్గాల నాయకుడన్నారు. కార్యక్రమంలో సుబ్బారావుపాల్గొన్నారు.

ఎలమంచిలిలో..


ఎలమంచిలిలో వంగవీటి మోహన రంగా చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులర్పించిన దృశ్యం

స్థానిక ఆర్టీసీ బస్టాండ్ జంక్షన్ వద్ద గురువారం వంగవీటి మోహనరంగా వర్ధంతిని తూర్పు కాపు అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వంగవీటి మోహనరంగా చిత్రపటానికి తూర్పు కాపు సంఘం పట్టణ అధ్యక్షుడు బొద్దపు శ్రీను, ఉపాధ్యక్షుడు ప్రకాష్, నక్కా శివ తదితరులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు, సభ్యులు కోడిగుడ్డు రమణబాబు, కొఠారు కొండబాబు, నక్కా వెంకటరమణ, గిరి, నరేష్, దొరయ్య మాస్టారు, బుల్లిబాబు, రాము తదితరులంతా పాల్గొన్నారు.

టిడ్కో కాలనీలో సమస్యల పరిష్కారానికి కృషి

- మునిసిపల్ కమిషనర్ ప్రసాదబాబు


సమావేశంలో మాట్లాడుతున్న కమిషనర్ ప్రసాదరాజు

ఎలమంచిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మునిసిపాలిటీ టిడ్కో గృహ సముదాయంలో సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని మునిసిపల్ కమిషనర్ ప్రసాదరాజు అన్నారు. గురువారం రాత్రి టిడ్కో కాలనీ వద్ద స్థానికులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కాలనీవాసులు పలు సమస్యలను కమిషనర్ దృష్టికి తీసుకువెళ్లారు. కాలనీలో ప్లాట్లు వర్షం వస్తే కారిపోతున్నా యన్నారు. తాగునీటి సదుపాయం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. కాలనీకి రోడ్డు లేకపోవడంతో మహిళలు, వృద్ధులు, చిన్నారులు అవస్థలు పడుతున్నామని, కాలనీలో నెలకొన్న సమస్యలను కమిషనర్‌కు సంఘ ప్రతినిధులు ప్రసాద్, హైరామ్, ఆశారాణి, మహిళలు వివరించారు. సమస్యలను టిడ్కో అధికారుల దృష్టికి తీసుకువెళ్లి వాటి పరిష్కారానికి కృషి చేస్తామన్నారు. కాలనీవాసుల సందేహాలను నివృత్తి చేశారు. ఈ సందర్భంగా కాలనీ ప్రతినిధులు, బ్లాక్ ఇన్‌చార్జులు కలిసి సమస్యల పరిష్కరించాలని కోరుతూ కమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మునిసిపల్ ఉద్యోగి సంతోష్, టిడ్కో సముదాయం ప్రతినిధులు పాల్గొన్నారు.

సుంకపూర్‌లో సీతారాముల విగ్రహాల ప్రతిష్ఠ


ఆలయంలో విగ్రహాలు ప్రతిష్ఠించిన దృశ్యం

కోటవురట్ల, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సుంకపూర్ గ్రామంలోని ఆలయంలో సీతారాముల కాంస్య విగ్రహాలను ప్రతిష్ఠించారు. గురువారం ఆలయంలో వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామస్థులు కంచర్ల సత్యవెంకటరమణ, భవానీ సమక్షంలో సీతారాములు, లక్ష్మణ, ఆంజనేయ విగ్రహాలను ప్రతిష్ఠించారు. కాంస్య విగ్రహాలకు సింగంపల్లి సోంబాబు ఆర్థిక సాయం చేశారు. కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షుడు సింగంపల్లి శ్రీనివాసరావు, ఇతర పార్టీల నాయకులు పాల్గొన్నారు.

వేట నిషేధ భృతి చెల్లించాలని మత్స్యకారులు నిరసన


పూడిమడక తీరం వద్ద ఆందోళన చేస్తున్న మత్స్యకారులు

అచ్యుతాపురం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వేట నిషేధ భృతి చెల్లించాలంటూ గురువారం పూడిమడక తీరంలో మత్స్యకారులు, మత్స్య కార్మిక సంఘం ఆధ్వర్యంలో నిరసన తెలియజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఎనిమిది నెలలవుతున్నా వేట నిషేధ భృతి ఇవ్వలేదన్నారు. ఇటీవల వరుస తుపాన్‌ల కారణంగా మత్స్యకారులు చేపల వేట సాగక తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మత్స్యకార నాయకులు డి.కాశి, చేపల తాతలు, కె.సోమునాయుడు, వి.చిన్నయ్యతాత, వి.కోదండరావు, ఎం.రాజు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా క్రిస్మస్ వేడుకలు


కేక్ కట్‌చేస్తున్న మజ్జూరి నారాయణరావు తదితరులు

పాయకరావుపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : స్థానిక మంగవరం రోడ్డులోని సియోను ప్రార్థన మందిరంలో గురువారం క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పాస్టర్ జాన్ మోజెస్ ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా తుని, పాయకరావుపేట తాపీమేస్త్రీల సంఘం అధ్యక్షుడు మజ్జూరి నారాయణరావు క్రిస్మస్ కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచారు.

భూ సమస్యల పరిష్కారానికే రెవెన్యూ సదస్సులు

నక్కపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): భూ సమస్యలను పరిష్కరించాలన్న ఉద్దేశంతో ప్రభుత్వం నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను రైతులు సద్వినియోగపర్చుకోవాలని తహసీల్దార్ నర్సింహమూర్తి చెప్పారు.మండలంలోని న్యాయంపూడిలో గురువారం రెవెన్యూ సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా రైతుల నుంచి భూ సంబంధిత సమస్యలపై వినతిపత్రాలు స్వీకరించారు. కార్యక్రమంలో సర్పంచ్ రెడ్డి వరహాలుబాబు, ఎంపీటీసీ సభ్యుడు ఆకేటి గోవిందరావు పాల్గొన్నారు.

ఎస్.రాయవరం: ఎస్.రాయవరంలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో రైతుల నుంచి నాలుగు వినతులు అందాయని తహసీల్దార్ జె. రమేష్‌బాబు తెలిపారు. కొద్ది రోజుల క్రితం గ్రామంలో నిర్వహించిన రీ సర్వే గ్రామసభ ద్వారా చాలా వరకు భూ సమస్యలు పరిష్కారం కావడంతో వినతులు తక్కువ వచ్చాయని చెప్పారు.

కోటవురట్ల: రైతులు ఇచ్చినా ప్రతి ఫిర్యాదును ఆన్‌లైన్‌లో నమోదు చేసి పరిష్కరిస్తామని తహసీల్దార్ తిరుమలబాబు అన్నారు. గురువారం మండలంలోని రాజుపేటలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో ఆయన మాట్లాడారు. రైతుల నుంచి 2 వినతిపత్రాలు అందాయన్నారు. సమావేశంలో గ్రామ సర్పంచ్ బి.వెంకటరమణ, ఆర్ఐ, వీఆర్వో మట్ల అనుష సిబ్బంది పాల్గొన్నారు.

పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు అప్పలరాజు


వర్షాలకు దెబ్బతిన్న వరిని పరిశీలిస్తున్న సీపీఎం నేతలు

నక్కపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరస అల్పపీడనాలతో కురిసిన వర్షాలకు వందలాది ఎకరాల్లో వరి పంట నీట మునిగి రైతులు నష్టపోయారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎం.అప్పలరాజు అన్నారు. గురువారం మనబాలవానిపాలెంలో దెబ్బతిన్న వరి పంటను సీపీఎం నేతలు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంగుమారిన, తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం క్వింటాలు రూ. 2,300లకు కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు. వరి కుప్పలు తడసిపోయకుండా రైతులందరికీ టార్పాలిన్లు సరఫరా చేయాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ మండల కన్వీనర్ ఎం.రాజేశ్, పార్టీ నాయకులు కె.ప్రసాద్ పాల్గొన్నారు.

గ్రామాలలో మేలుకొలుపు

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ధనుర్మాసం సందర్భంగా మండలంలోని గ్రామాలలో ప్రజలు, భక్తులు, మేలుకొలుపు కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. సత్యవరం, రాజగోపాలపురం, పెదరాంభద్రపురం, మాసాహెబ్‌పేట, మంగవరం, కుమారపురం తదితర గ్రామాలలో తెల్లవారుజామున సీతారాముల చిత్రపటాన్ని పట్టుకుని వీధుల్లో భక్తి గీతాలు ఆలపిస్తూ, భజనలు చేశారు. ధనుర్మాసం వచ్చిందంటే పల్లెల్లో పండుగ ప్రారంభమైనట్టే భావించి, ఆధ్యాత్మిక శోభ నెలకొంటుంది.

'రైతులు అప్రమత్తంగా ఉండాలి'

పాయకరావుపేట రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): వరి కోతలు కోసిన రైతులు జాగ్రత్తలు పాటించాలని మండల వ్యవసాయాధికారి పి. ఆదినారాయణ అన్నారు. మండలంలోని రాజవరం, కేశవరం, గ్రామాలలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులకు కొన్ని సూచనలు చేశారు. పనలు ఆరకుండా కుప్పలు వేయడం వలన కుళ్లిపోయే ప్రమాదం ఉందని, అల్పపీడనం ప్రభావం తగ్గిన తర్వాత వేసిన వరి కుప్పలను ఒకసారి పరిశీలించుకోవాలన్నారు. ప్రకృతి వ్యవసాయం, ప్రభుత్వం అందించే పథకాలు వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ చార్జీలపై పోరుబాట

మునగపాక, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం విద్యుత్ చార్జీల పెంపును నిరసిస్తూ ఈ నెల 27వ తేదీన పోరుబాట పేరుతో నిరసన చేపడుతున్నట్టు వైసీపీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేడ ప్రసాద్ తెలిపారు. గురువారం క్యాంపు కార్యాలయంలో విలేకర్లతో మాట్లాడుతూ పెంచిన చార్జీలకు నిరసనగా స్థానిక విద్యుత్ వినియోగదారులు కేంద్రం వద్ద ఆందోళన చేస్తామని, పార్టీ ప్రజాప్రతినిధులు, నాయకులు తరలి రావాలన్నారు.

పాయకరావుపేటలో..

రాష్ట్రంలో కరెంట్ చార్జీలు పెంపుపై శుక్రవారం పట్టణంలో ఆందోళన చేయనున్నట్టు వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు అన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటుచేసిన కార్యక్రమంలో ఆందోళనకు సంబంధించిన పోస్టర్ విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో వైసీపీ మండల అధ్యక్షులు చిక్కాల రామారావు, పట్టణ పార్టీ అధ్యక్షులు ధనిశెట్టి బాబి, నాయకులు జగతా శ్రీనివాస్, దేవవరపు రాజేష్‌ఖన్నా, చేపల తాతాజీ, పోసిన వీరబాబు, సన్యాసిరావు, తదితరులు పాల్గొన్నారు.

ఏటికొప్పాక హస్త కళాకారుడు సంతోష్‌కు సత్కారం


సంతోష్‌ను సత్కరిస్తున్న బీజేపీ అర్టిజన్ సెల్ ప్రతినిధులు

ఎలమంచిలి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గణతంత్ర వేడుకల్లో పాల్గొననున్న ఏపీ శకటం నమూనాను రూపొందించిన ఏటికొప్పాక హస్త కళాకారుడు జి.సంతోష్‌ను బీజేపీ జిల్లా అర్టిజన్ సెల్ ప్రతినిధులు బుధవారం రాత్రి ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ.. ఏటికొప్పాక హస్త కళాకారులు అంకుడు కర్రతో సహజసిద్ధ రంగులను ఉపయోగించి బొమ్మలను తీర్చిదిద్దడం గొప్ప విషయమన్నారు. కార్యక్రమంలో రాష్ట్రపతి అవార్డు గ్రహీత సీవీ.రాజు, బీజేపీ అర్టిజన్ సెల్ జిల్లా ప్రతినిధులు కె.పవన్, బాబ్జీ, డి.సతీష్, ఏ.రామకృష్ణ, చుక్కా కన్నబాబు, మొల్లేటి ప్రసాద్, ఆర్.రామాచార్యులు, కళాకారులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నక్కపల్లి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేంపాడు 33/11కేవీ సబ్ స్టేషన్ పరిధిలో శుక్రవారం మరమ్మతు పనుల నిమిత్తం విద్యుత్ సరఫరాను కొన్ని గ్రామాలకు నిలిపివేస్తామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి డివిజన్ ఈఈ కె.రాజశేఖర్, ఏఈ కృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ డొంకాడ, రేబాక, ముకుందరాజుపేట, చీడిక, దోసలపాడు, వేంపాడు, నెల్లిపూడి, గునిపూడి, చినదొడ్డిగల్లు గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని, వినియోగదారులు గమనించాలని వారు కోరారు.

ఎస్.రాయవరంలో..

మండలంలోని కొరుప్రోలు సబ్ స్టేషన్ పరిధిలోని విద్యుత్ లైన్లపై ఉన్న చెట్ల కొమ్మల తొలగింపు నిమిత్తం శుక్రవారం ఉదయం ఎనిమిది గంటల నుంచి మధ్యాహ్నం రెండు గంటల విద్యుత్ పరఫరా నిలిపివేస్తున్నట్టు ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ రాజశేఖర్ తెలిపారు. ఈ కారణంగా గోకులపాడు, చినగుమ్ములూరు, పెదగుమ్ములూరు, భీమవరం, పెట్టుగోళ్ళపల్లి, సీతారామపురం గ్రామాలతోపాటు నక్కపల్లి మండలంలోని బోదుగెళ్లం, రామకృష్ణాపురం, దొడ్డుగొల్లులకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందన్నారు.

అచ్యుతాపురంలో..

విద్యుత్ లైన్ల మరమ్మతుల కారణంగా శుక్రవారం మండలంలో 16 గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నామని ఏపీఈపీడీసీఎల్ అనకాపల్లి ఈఈ కె.రాజశేఖర్ తెలిపారు. అచ్యుతాపురం, రామన్నపాలెం, మోసయ్యపేట, చోడపల్లి, అవసోమవరం, ఆవరాజాం, చీమలాపల్లి, అప్పన్నపాలెం, బంగారయ్యపాలెం, జేపీ అగ్రహారం, నారపాక, దుప్పితూరు, కోనెంపాలెం, కుమారపురం, భోగాపురం, దిబ్బపాలెం, వెదురువాడల్లో ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తుట్టు ఆయన తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై సమీక్ష

నక్కపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): పంచాయతీల పరిధిలో చేపట్టాల్సిన పనులపై గురువారం మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో డి. సీతారామరాజు పంచాయతీ సెక్రటరీలు, ఫీల్డ్ అసిస్టెంట్లు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఆర్-1 యాప్, స్వర్ణ పంచాయతీ అప్‌డేట్, గ్రామాల్లో శానిటేషన్ పనులు, పల్లెపండుగ పనులు, ఉపాధి పనులు, రైతుల ఈకేవైసీ నమోదు తదితర అంశాలపై సమీక్ష జరిపారు.

భక్తిశ్రద్ధలతో మార్గశిర మాసోత్సవాలు


కశింకోటలో కనకమహాలక్ష్మి అమ్మవారు


దేవీపురంలో అమ్మవారికి భక్తుల పూజలు

కశింకోట : ఇక్కడి గవరపేట వీధిలో గల కనకమహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో మార్గశిర మాసోత్సవాలు నేత్రపర్వంగా జరుగుతున్నాయి. ఇందులో భాగంగా గురువారం విశేష పూజలు నిర్వహించారు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు, గవర కార్పొరేషన్ చైర్మన్ మళ్ల సురేంద్ర తదితరులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ నిర్వాహకులు దాడి నాగరాజు, వేగి వెంకట్రావు, భీశెట్టి కుమార్, వేగి దొరబాబు, దాడి కృష్ణ, వేగి పవన్‌కుమార్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

సబ్బవరం : మండలంలోని దేవీపురంలో గురువారంతో మార్గశిర మాసోత్సవాలు ముగిశాయి. ఈ సందర్భంగా మహాలక్ష్మీ అమ్మవారికి పంచామృతాభిషేకాలు, యాగశాలలో సహస్రనామావళి, హోమాలు, వారాహీ సహిత చండీహోమం వంటి వాటిని వైభవంగా నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులతో పాటు అమృత కన్యకా గురుకులపు విద్యార్థినులు దర్శించుకున్నారు. గురుపత్ని అన్నపూర్ణమ్మ, శ్రీవిద్యా ట్రస్టు నిర్వాహకులు కందర్ప రమా, ప్రభాకర్ ఏర్పాట్లను పర్యవేక్షించారు.

దిబ్బవీధి నృసింహస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు


స్వామివారి పూజల్లో పాల్గొన్న రత్నాకర్, భక్తులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెం దిబ్బవీధిలోని వరహా లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో గురువారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి స్వర్ణ సంపంగి పుష్పాలతో అర్చనలు, అభిషేకాలు జరిపారు. టీడీపీ రాష్ట్ర కార్య నిర్వాహక కార్యదర్శి దాడి రత్నాకర్, అచ్యుత దంపతులు హాజరై స్వామివారి పాదుకలను ప్రతిష్ఠించారు. ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు, కొణతాల భాస్కరరావు, శిలపరశెట్టి బాబి, విల్లూరి పరమేశ్వరరావు, యల్లపు సత్యనారాయణ, కాండ్రేగుల రాము, కొణతాల రాంబాబు, మద్దాల కృష్ణ, కోటిపల్లి శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా సంతోషిమాత ఆలయ వార్షికోత్సవం


అమ్మవారి ఉత్సవమూర్తికి అభిషేకం జరుపుతున్న అర్చకుడు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గవరపాలెంలో సంతోషిమాత ఆలయ 45 వార్షికోత్సవాన్ని గురువారం అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. తొలుత అర్చకులు సరిపల్లి కామేశ్వరరావు అభిషేకాలు, అర్చనలు, హోమం జరిపారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ఈవో టి.రాజసులోచన, చైర్మన్ మారిశెట్టి భాస్కరరావు, సభ్యులు రాపేటి సంతోష్ నర్సింగమూర్తి, ఆళ్ల రవికుమార్, బుద్ధ ఈశ్వరరావు తదితరులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

'గ్రావెల్ అక్రమ తవ్వకాల కట్టడికి కమిటీ'


విలేకరుల సమావేశంలో తహసీల్దార్ చిన్నికృష్ణ, సీఐ రమణ, మైనింగ్ శాఖ ఆర్ఐ శ్రీనివాసరావు

సబ్బవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : గ్రావెల్ అక్రమ తవ్వకాలు, రవాణాను అరికట్టేందుకు పోలీసు, రెవెన్యూ, మైనింగ్ శాఖలు సంయుక్త కమిటీని ఏర్పాటు చేసినట్టు తహసీల్దార్ బి.చిన్నికృష్ణ తెలిపారు. ఈ మూడు విభాగాలు గురువారం ఇక్కడ సంయుక్తంగా నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మండలంలోని గంగవరం, ఎరుకునాయుడుపాలెం, పైడివాడ, పైడివాడ అగ్రహారం, అసకపల్లి, ఎల్లుప్పి తదితర గ్రామాల్లో అక్రమంగా మట్టి, రాయి తవ్వకాలు, రవాణా జరుగుతున్నట్టు ఫిర్యాదులు అందుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో ఏర్పాటు చేసిన కమిటీ ఎప్పటికప్పుడు ఆకస్మిక తనిఖీలు నిర్వహించనుందన్నారు. పట్టుబడితే క్రిమినల్ చర్యలతో పాటు భారీగా జరిమానాలు, యంత్రాలు సీజ్ వంటివి చేపట్టడం జరుగుతుందని వివరించారు. సీఐ పిన్నింటి రమణ మాట్లాడుతూ మండలంలో మట్టి, రాయి తవ్వకాలకు ఎటువంటి అనుమతులు లేవన్నారు. ఇవి అవసరమైనవారు రెవెన్యూ, మైనింగ్ శాఖల నుంచి తాత్కాలికంగా అనుమతులు తీసుకోవాలన్నారు. మైనింగ్ శాఖ ఆర్ఐ శ్రీనివాసరావు మాట్లాడుతూ ఎరుకునాయుడు పాలెంలో రెండు క్వారీలకు సంబంధించిన అంశం కోర్టులో ఉందన్నారు. ఎక్కడైనా అక్రమ మైనింగ్ జరిగితే ప్రజలు తమకు సమాచారం అందించాలని కోరారు.

తాళ్లపాలెంలో జోరుగా టీడీపీ సభ్యత్వ నమోదు


సభ్యత్వ నమోదు చేస్తున్న టీడీపీ నాయకులు

కశింకోట, డిసెంబరు 26 : తాళ్లపాలెం గ్రామంలో తెలుగుదేశం పార్టీ సభ్యత్వ నమోదు కార్యక్రమం జోరుగా సాగుతోంది. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు కార్యకర్తల సంక్షేమం కోసం ప్రవేశపెట్టి సభ్యత్వాన్ని ప్రతి ఒక్క కార్యకర్త పొందాలని ఆ పార్టీ నాయకులు గ్రామాల్లో వివరిస్తున్నారు. గురువారం ఉదయం నుంచి రాత్రి తొమ్మిది గంటల వరకు ఐదు వందల మంది సభ్యత్వాలు చేయించామని ఎన్టీఆర్ ఆసుపత్రి డైరెక్టర్ ఉల్లింగల రమేష్ తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు ఆంద్ర ప్రసాద్, నిమ్మదల శ్రీను, నక్కా సాయి, ఆంద్ర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ చార్జీల భారానికి వ్యతిరేకంగా ఆందోళన


పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న భరత్‌కుమార్ తదితరులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలో శుక్రవారం జరిగే పోరుబాటను అంతా విజయవంతం చేయాలని వైసీపీ అనకాపల్లి నియోజకవర్గ సమన్వయకర్త మలసాల భరత్‌కుమార్ పిలుపునిచ్చారు. గురువారం రింగు రోడ్డులోని పార్టీ కార్యాలయంలో ఇందుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఎన్నికల ముందు విద్యుత్ చార్జీలు పెంచబోమని చెప్పి అధికారంలోకి వచ్చిన తరువాత కూటమి ప్రభుత్వం వినియోగదారులపై విద్యుత్ చార్జీల భారం మోపుతోందని ఆరోపించారు. నాయకులు దంతులూరి దిలీప్ కుమార్, మందపాటి జానకిరామరాజు, జాజుల రమేష్, మలసాల కిశోర్, మళ్ల బుల్లిబాబు, కె.ఎం. నాయుడు, కోరుకొండ రాఘవ, భీశెట్టి జగన్, గైపూరి రాజు తదితరులు పాల్గొన్నారు.

ఐదేళ్లుగా.. అసంపూర్తిగానే..!

అర్ధంతరంగా నిలిచిన అంగన్‌వాడీ భవనాల నిర్మాణం

- ఐదేళ్ల వైసీపీ పాలనలో తీవ్ర నిర్లక్ష్యం
- ఒక్క రూపాయి మంజూరు కాని వైనం
- గత్యంతరం లేక పలుచోట్ల అద్దె భవనాల్లో నిర్వహణ
- ఇబ్బందులు పడుతున్న పిల్లలు, సిబ్బంది


గొల్లగుంటలో అసంపూర్తి నిర్మాణం

పరవాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాల్లో అంగన్‌వాడీ కేంద్రాల భవనాలు అసంపూర్తిగా దర్శనమిస్తున్నాయి. ఐదేళ్లుగా ఇదే దుస్థితి కొనసాగుతోంది. దీంతో పలుచోట్ల ఈ కేంద్రాలను అద్దె భవనాల్లో అసౌకర్యాల నడుమ నిర్వహిస్తున్నారు. ఇందుకు సంబంధించిన వివరాలివి. 2017లో అప్పటి టీడీపీ ప్రభుత్వం పలు గ్రామాల్లో అంగన్‌వాడీ భవనాలు నిర్మించేందుకు సంకల్పించింది. ఇందులో భాగంగా నాటి పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేతుల మీదుగా భవనాల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఒక్కో భవనానికి రూ.10 లక్షలు చొప్పున నిధులు కేటాయించారు. ఎన్ఆర్‌జీఎస్ నిధులు రూ.ఐదు లక్షలు, ఎస్‌డీపీ నిధులు రూ.2.5 లక్షలు, ఐసీడీఎస్ నిధులు రూ.రెండు లక్షలు, గ్రామ పంచాయతీల నుంచి రూ.50వేల నిధులు కలిపి మొత్తం రూ. పది లక్షలతో భవనాల నిర్మాణం పూర్తిచేయాలని భావించి పనులు ప్రారంభించారు. 2019 ఏప్రిల్ నాటికి భవనాల నిర్మాణం 80 శాతం పూర్తయింది. కాంట్రాక్టర్లకు బిల్లు చెల్లింపులు అంతంత మాత్రంగానే జరగడంతో వారు నిర్మాణ పనులను నిలుపుదల చేశారు. ఇంతలో వైసీపీ అధికారంలోకి వచ్చింది. అంగన్‌వాడీ భవనాల నిర్మాణాన్ని పూర్తిగా నిర్లక్ష్యం చేసింది. ఐదేళ్ల వైసీపీ పాలనలో భవనాల నిర్మాణానికి ఒక్క రూపాయి కూడా నిధులు మంజూరు చేయకపోవడంతో ఎక్కడి పనులు అక్కడే నిలిచిపోయాయి.


రేఖవానిపాలెంలో అసంపూర్తిగా దర్శనమిస్తున్న అంగన్‌వాడీ భవనం

మొత్తం పదహారు భవనాలు అసంపూర్తి

రావాడ పంచాయతీ పరిధి రేఖవానిపాలెం, గొల్లగుంట, మోటూరివానిపాలెం, భరణికం పంచాయతీ పరిధి కట్టవానిపాలెం, అలాగే గొర్లెవానిపాలెం, పెద ముషిడివాడ, పచ్చికోరువానిపాలెం, మామిడివానిపాలెం, నక్కవానిపాలెం, నాయుడుపాలెం పంచాయతీ పరిధి కోరంగివానిపాలెం, మెట్టపాలెం, పాత రాజన్నపాలెం, వాడచీపురుపల్లి పంచాయతీ పరిధి వెంకటాపురం, పోలిరెడ్డిపాలెం, గొల్లలపాలెం, విస్సన్నపేటలలో మొత్తం 16 అంగన్‌వాడీ భవనాల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోయింది.

పలుచోట్ల అద్దె భవనాల్లో నిర్వహణ

అంగన్‌వాడీ భవనాల నిర్మాణం పూర్తికాకపోవడంతో పలుచోట్ల అద్దె భవనాల్లో నిర్వహణ కొనసాగుతోంది. ఈ కారణంగా ఇటు నిర్వాహకులు, అటు పిల్లలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అద్దె భవనాల్లో పూర్తిస్థాయిలో వసతులు లేకపోవడంతో అవస్థలు నడుమ కేంద్రాల నిర్వహణ కొనసాగుతోంది. కూటమి ప్రభుత్వమైనా స్పందించి ఈ భవనాల నిర్మాణాన్ని త్వరితగతిన పూర్తి చేయాలని అంతా కోరుతున్నారు.

భవనాల పూర్తికి చర్యలు చేపట్టాలి



ఐదేళ్లుగా అంగన్‌వాడీ భవనాల నిర్మాణం అసంపూర్తిగా నిలిచిపోవడం దారుణం. కనీసం కూటమి ప్రభుత్వమైనా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టాలి. సొంత భవనాలు లేకపోవడంతో కేంద్రాలను అద్దె భవనాల్లో అవస్థల నడుమ నిర్వహించాల్సి వస్తుంది. ఈ సమస్యపై ఉన్నతాధికారులు వెంటనే స్పందించాలి.

- మోటూరు సన్యాసినాయుడు, సర్పంచ్, రావాడ

నిధులు మంజూరుకు ప్రతిపాదనలు



అసంపూర్తిగా నిలిచిపోయిన అంగన్‌వాడీ భవనాలను పూర్తి చేసేందుకు అవసరమైన నిధులు మంజూరు కోసం ప్రతిపాదనలు సిద్ధం చేశాం. ఒక్కొక్క భవనానికి రూ.12 లక్షలు మేర ఖర్చవుతుంది. నిధులు మంజూరైన వెంటనే పనులు ప్రారంభిస్తాం. ఎమ్మెల్యే పంచకర్ల రమేశ్‌బాబు కూడా భవనాల నిర్మాణం పూర్తి చేయాలని ఆదేశించారు. త్వరలోనే పనులు పూర్తి చేస్తాం.

- కె.స్వాతి, మండల ఇంజనీర్

కూలి రేట్లు పెంచాలని ముఠా కార్మికులు ధర్నా



ఆర్డీవో కార్యాలయ ఎదుట ధర్నా చేస్తున్న ముఠా కార్మికులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని ముఠా కార్మికుల కూలిరేట్లు పెంపుపై ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో ముఠా కార్మికులు గురువారం ఇక్కడ ఆందోళన చేపట్టారు. తొలుత కూరగాయల మార్కెట్ నుంచి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీగా వచ్చేసి అక్కడ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ జిల్లా అధ్యక్షుడు ఆర్.శంకరరావు మాట్లాడుతూ కూలి రేట్లు పెంచాలని వర్తకులకు నోటీసులు ఇచ్చి 22 రోజులు గడిచినా ఎటువంటి స్పందన లేదన్నారు. యజమానులు ప్రస్తుతం ఇస్తున్న దానికి 13 శాతం మాత్రమే పెంచుతామని చెప్పడం సరైనది కాదన్నారు. ముఠా కార్మిక సంఘం గౌరవాధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ ఇప్పటికే నిత్యావసర వస్తువుల ధరలు, ఇంటి అద్దెలు పెరగడంతో కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. అందుకు తగ్గట్టుగా కూలి రేట్లు పెంచాల్సిన అవసరం ఎంతైనా ఉందని పేర్కొన్నారు. కూలి రేట్లు పెంచకపోవడం వల్లే కార్మికులంతా గురువారం నుంచి సమ్మె బాటపట్టారన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ ప్రతినిధులు వీవీ శ్రీనివాసరావు, కాళ్ల తేలయ్యబాబు, బోడి రాజు, కాపుశెట్టి అప్పారావు, భీశెట్టి అప్పారావు, తిర్రి సురేష్, మహాలక్ష్మినాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద సీఐటీయూ ధర్నా



కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాయకులు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చండీఘర్ కార్మికులు చేస్తున్న పోరాటానికి సంఘీభావంగా గురువారం పట్టణంలోని నిదానందొడ్డిలో గల ఈపీడీసీఎల్ కార్యాలయం వద్ద సీఐటీయూ నాయకులు ధర్నా నిర్వహించారు. కేంద్ర ప్రభుత్వ విధానాల వల్ల విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేస్తున్నారని సదరు నాయకులు ఆరోపించారు. చండీఘర్ రాష్ట్రంలో డిస్కంను ప్రైవేటు కంపెనీలకు అప్పగిస్తున్నారని, అక్కడ విద్యుత్ కార్మికులు అనేక పోరాటాలు చేస్తుంటే ఆ రాష్ట్ర ప్రభుత్వం ఎస్మాను ప్రయోగించి ఉద్యమాన్ని అణిచివేస్తుందని ఆరోపించారు. రాష్ట్రంలో కూడా విద్యుత్ సంస్కరణలను తీసుకువచ్చి విద్యుత్ రంగాన్ని ప్రైవేటుపరం చేయడానికి, కార్పొరేట్ కంపెనీలకు కట్టబెట్టడానికి చూస్తున్నారన్నారు. విద్యుత్ ప్రైవేటీకరణను ఆపాలని, స్మార్ట్ మీటర్లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్, వీవీ శ్రీనివాసరావు, బి.రాజు, కల్యాణం, ఉమామహేశ్వరరావు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

అనకాపల్లి మండలంలో 1640 హెక్టార్లలో వరి కోతలు

- వరి పనలు వర్షానికి నానితే నీటిలో ఉప్పు కలిపి పిచికారీ చేయండి
- రైతులకు వ్యవసాయ సహాయ సంచాలకులు రామారావు సూచన


కూండ్రంలో వరి పంటను పరిశీలిస్తున్న ఏడీఏ రామారావు తదితరులు

కొత్తూరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూండ్రంలో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ సహాయ సంచాలకులు ఎం.రామారావు క్షేత్రస్థాయిలో పర్యటించారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితుల్లో రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. వరి కోతలు పూర్తి చేసినవారు పనలను కుప్పలుగా వేసుకోవాలన్నారు. పంట కోయని వారు రెండు రోజులు ఆగిన తరువాత కోస్తే తుపాన్ నుంచి తప్పించుకోవచ్చని వివరించారు. వరి పనలు వర్షానికి నానినప్పుడు లీటరు నీటికి 50 గ్రాముల ఉప్పు కలిపి పిచికారీ చేయాలని ఈ విధంగా చేస్తే ధాన్యం మొలకెత్తకుండా, రంగు మారకుండా ఉంటుందన్నారు. అలాగే నువ్వులు, మినుములు, పెసలు, పొద్దు తిరుగుడు వంటి పంటలు వేసే రైతులు తప్పనిసరిగా ఇ-పంట నమూనా చేసుకోవాలన్నారు. మండలంలో 2,509 హెక్టార్లకు ఇప్పటి వరకు 1640 హెక్టార్లలో వరి కోతలు నిర్వహించారన్నారు. 281 హెక్టార్ల వరి పనలపై ఉన్నట్లు గుర్తించామన్నారు. తుపాన్ ప్రభావం తగ్గిన తరువాత మిగిలిన 588 హెక్టార్లలో పంటను కోసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏవో రంగాచారి, వ్యవసాయ విస్తరణాధికారి శ్రీనివాస్, వ్యవసాయ సహాయకులు తులసి తదితరులు పాల్గొన్నారు.

ఏపీ గ్రామీణ వికాస్ బ్యాంకు సేవలు నాలుగు రోజులు నిలిపివేత

- రీజనల్ మేనేజర్ సతీష్ చంద్ర



అనకాపల్లి రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వ ఆర్థిక సేవల విభాగం ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ గ్రామీణ వికాస్ బ్యాంక్ (ఏపీజీవీబీ) ఆంధ్రా, తెలంగాణ విభాగాల విభజన దృష్ట్యా ఈ నెల 28వ తేదీ నుంచి నాలుగు రోజుల పాటు బ్యాంకు సేవలను నిలిపివేస్తున్నట్టు బ్యాంక్ రీజనల్ మేనేజర్ ఎస్.సతీష్ చంద్ర గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలంగాణలోని వరంగల్ కేంద్రంగా ఏపీజీవీబీ రెండు తెలుగు రాష్ట్రాల్లో పనిచేస్తుందని పేర్కొన్నారు. బ్యాంకు కార్యకలాపాలు రెండు రాష్ట్రాల్లో విభజన జరుగుతుందని వివరించారు. ఇందులో భాగంగా ఈ నెల 28వ తేదీ నుంచి 31వ తేదీ వరకు బ్యాంకు సేవలతో పాటు ఏటీఎం కార్డులు, ఆన్‌లైన్ నగదు లావాదేవీలన్నీ నిలుపుదల చేయనున్నామని తెలియజేశారు. 2025 జనవరి ఒకటవ తేదీ నుంచి బ్యాంకు సేవలు యథావిధిగా అందుబాటులోకి వస్తాయని, ఖాతాదారులు గమనించి సహకరించాలని ఆయన కోరారు.

శివాలయం పునర్నిర్మాణానికి విరాళం


కమిటీ సభ్యులకు విరాళం అందిస్తున్న రాములు

సబ్బవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ఇక్కడి పురాతన శివాలయం పునర్నిర్మాణానికి సబ్బవరానికి చెందిన ధనలక్ష్మి సైకిల్ షాపు యజమాని రొంగలి రాములు రూ.60,116ల విరాళాన్ని గురువారం అందజేశారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు దంగేటి నాని, ప్రకాశ్, గెడ్డం కృష్ణ, కొల్లి గంగునాయుడు, ముర్రి కనకరాజు, పెన్నం శ్రీనివాసరావులు ఆయనను సత్కరించారు.

ఆశీల వసూలు వేలం పాట ఖరారు

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని మార్కెట్లలో ఆశీల వసూలుకు నిర్వహించిన వేలం పాటను బొడ్డేడ వెంకటరమణమూర్తికి జీవీఎంసీ జోనల్ అధికారులు ఖరారు చేశారు. గురువారం ఆశీల వేలం పాట రెవెన్యూ అధికారి పి.సురేష్ అధ్యక్షతన సిబ్బంది ఇక్కడ నిర్వహించారు. జనవరి నుంచి మార్చి 31వ తేదీ వరకు కార్యాలయ పరంగా రూ.17లక్షల ఐదు వేలతో పాట ప్రారంభించారు. పాటలో పాల్గొన్న ముగ్గురు వెయ్యి రూపాయలు చొప్పున పెంచారు. చివరకు రూ.17 లక్షల పది వేలకు పాడడంతో వెంకటరమణమూర్తికి ఖరారు చేశారు. అయితే అధికారులు ఈ ప్రతిపాదనను జీవీఎంసీ ఉన్నత కార్యాలయానికి పంపిన తరువాత కమిషనర్, స్టాండింగ్ కౌన్సిల్ ఆమోదం లభించాకే కాంట్రాక్టర్‌కు పూర్తిస్థాయిలో ఆశీలు వసూలుకు అవకాశం ఉంటుంది.

హెల్మెట్ ధారణపై వాహన చోదకులకు అవగాహన


హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న సీఐ వెంకటనారాయణ

అనకాపల్లి టౌన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ద్విచక్ర వాహనాలు నడిపేటప్పుడు ప్రతి ఒక్కరూ హెల్మెట్‌ను తప్పనిసరిగా ధరించాలని ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ సూచించారు. ఇక్కడి జాతీయ రహదారిలోని నూకాంబిక అమ్మవారి ఆలయ ముఖద్వారం వద్ద జాతీయ రహదారిపై వెళ్తున్న వాహనచోదకులను గురువారం ఆపి, వాహనాలకు తగిలించిన హెల్మెట్‌లను ధరించాలని తెలిపారు. ఈ సందర్భంగా వారికి ట్రాఫిక్ నిబంధలపై అవగాహన కల్పించారు. హెల్మెట్ ధరించడం వల్ల ఒకవేళ ప్రమాదం జరిగినా ప్రాణహాని ఉండదన్నారు. హెల్మెట్ ధరించని పక్షంలో అటువంటి వారికి అపరాధ రుసుం విధించడంతో పాటు మూడు నెలలు వారి లైసెన్సు రద్దు చేయడం జరుగుతుందని హెచ్చరించారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలకు లోబడి వాహనాలు నడపాలన్నారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యల పరిష్కారానికి రెవెన్యూ సదస్సులు చక్కని వేదిక


పరవాడ మండలం పి.బోనంగిలో అర్జీలు అందుకుంటున్న తహసీల్దార్

పరవాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : రెవెన్యూ సదస్సులో అందే ప్రతి అర్జీని క్షుణ్ణంగా విచారించి, సమస్యను నిర్ణీత గడువులోగా పరిష్కరిస్తామని తహసీల్దార్ ఎస్.వి.అంబేడ్కర్ తెలిపారు. పి.బోనంగిలో గురువారం నిర్వహించిన రెవెన్యూ సదస్సులో మాట్లాడారు. భూ సమస్యల పరిష్కారానికి ఇదో చక్కని వేదికగా పేర్కొన్నారు. అనంతరం 48 మంది అర్జీలను సమర్పించారు. రీసర్వే డిప్యూటీ తహసీల్దార్ సురేశ్, సర్పంచ్ బండారు కల్పన, స్థానిక నాయకులు రాయవరపు దేముడు, బండారు రాజశేఖర్, గొంతిన రాము, వీఆర్వో బొడ్డు శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

సబ్బవరం : మండలంలోని అమృతపురంలో రెవెన్యూ సదస్సు నిర్వహించారు. తహసీల్దార్ బి.చిన్నికృష్ణ హాజరై ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అపరిష్కృతంగా ఉన్న భూ సమస్యలను పరిష్కరించేందుకే ప్రభుత్వం ఈ సదస్సులు నిర్వహిస్తున్నట్టు చెప్పారు. సర్పంచ్ బైలపూడి గౌరీ, ఎంపీటీసీ శింగంపల్లి శ్రీను, సర్వేయర్లు ఎల్.అప్పారావు, లోకేశ్, శేఖర్, రాంబాబు, వీఆర్వో జగన్నాథరావు, గ్రామ పెద్దలు బైలపూడి రామారావు, బోకం అప్పలనాయుడు, బాలకృష్ణ, శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.


సబ్బవరం మండలం అమృతపురంలో...


అనకాపల్లి మండలం పిసినికాడ సదస్సుకు హాజరైన అర్జీదారులు

కొత్తూరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను అంతా సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ తహసీల్దార్ శ్రీరామ్మూర్తి అన్నారు. అనకాపల్లి మండలం పిసినికాడ, సంపతిపురం పంచాయతీ టి.వెంకుపాలెంలలో గురువారం రెవెన్యూ సదస్సులను నిర్వహించారు. ఈ సందరంగా ఆయన మాట్లాడుతూ సమస్యలపై అర్జీని సమర్పించిన 45 రోజుల్లో పరిష్కారం చూపేందుకు కృషి చేస్తామన్నారు. పిసినికాడలో 77, టి.వెంకుపాలెంలో 17 అర్జీలు అందినట్టు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమాల్లో ఆర్ఐ రమేష్, మండల సర్వేయర్ మోహనరావు తదితరులు పాల్గొన్నారు.


గ్రామ వలంటీర్ల రిలే నిరాహార దీక్షలు ప్రారంభిస్తున్న చిన్నయ్యపడాల్


ముంచంగిపుట్టులో అంబేడ్కర్ వి గ్రహం వద్ద వలంటీర్ల నిరసన

గ్రామ వలంటీర్లను విధుల్లోకి తీసుకోకుంటే ఉద్యమం

▸▸ సంఘం గౌరవాధ్యక్షుడు చిన్నయ్యపడాల్

పాడేరురూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): గ్రామ వలంటీర్లను విధుల్లోకి తీసుకోవాలని, లేని పక్షంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమాన్ని నిర్వహిస్తామని జిల్లా వలంటీర్ల సంఘం గౌరవాధ్యక్షుడు బోనంగి చిన్నయ్యపడాల్ హెచ్చరించారు. సమస్యలు పరిష్కరించాలని కోరుతూ గురువారం పాడేరులో వలంటీర్లు చేపట్టిన రిలే నిరాహార దీక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వలంటీర్ల మీద ప్రభుత్వానికి రాజకీయ కక్షలు సాధింపు తగదన్నారు. రా ష్ట్ర వ్యాప్తంగా వీరు 2.50 లక్షల మంది నిరుద్యోగులన్న విషయాన్ని మరిచిపోవద్దన్నారు. వీరి ఏడు నెలల బకాయిలు చెల్లించాలన్నారు. వారంతా వైసీపీ కార్యకర్తలు అనుకుంటే ఎందుకు ఆపార్టీ ఎన్నికల్లో ఓటమి పాలయ్యిందని ప్రశ్నించారు. గత వైసీపీ ప్రభుత్వం వీరితో వెట్టిచాకిరీ చేయించుకున్నారని మండిపడ్డారు. రూ. 10 వేల వేతనంతో వలంటీర్ వ్యవస్థను కొనసాగిస్తానని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. సీఐటీయూ జిల్లా నాయకులు ఎల్.సుందరరావు, వాలంటీర్ల సంఘం జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ప్రసాద్, కొండబాబు, వాలంటీర్లు పాల్గొన్నారు.

పెదబయలు: తమ సమస్యలను పరిష్కరించాలని గ్రామ వలంటీర్లు గురువారం స్థానిక అంబేడ్కర్ పార్కు వద్ద రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. ఈ దీక్షకు సీఐటీయూ మద్దతు తెలిపింది . సందర్భంగా వలంటీర్ల సంఘ నాయకులు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు రాష్ట్ర వ్యాప్తంగా గ్రామ, వార్డు వలంటీర్లను విధుల్లో చేర్చుకోవాలన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సన్నిబాబు, సర్పంచ్ రవిశంకర్, తాతబాబు, కృష్ణారావు తదితరులు పాల్గొన్నారు.

అనంతగిరి: స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద గురువారం గ్రామ వలంటీర్లు ఆందోళన కార్యక్రమం చేపట్టారు. వీరికి జడ్పీటీసీ గంగరాజు సంఘీభావం తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల్లో కూటమి ప్రభుత్వం హామీ ఇచ్చినట్టుగా వలంటీర్లను రెన్యువల్ చేసి, వారికిరూ.10 వేలు గౌరవ వేతనం అందజేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలోని టోకూరు సర్పంచ్ మోస్య, తదితరులు పాల్గొన్నారు.

ముంచంగిపుట్టు: కూటమి ప్రభుత్వం వలంటీర్లకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఉమామహేశ్వరరావు అన్నారు. వలంటీర్లు సీఐటీయూ ఆధ్వర్యంలో ఇక్కడ రిలే నిరాహార దీక్ష చేపట్టారు. అంబేడ్కర్ విగ్రహం ఎదుట నిరసన చేపట్టారు.ఆ సంఘం మండల కార్యదర్శి కె.శంకరావు, గిరిజన సంఘం నేతలు ఎం.ఎం.శ్రీను పాల్గొన్నారు.


రహదారి వద్ద నిరసన తెలుపుతున్న మాలసలవీధి గిరిజనులు


రోడ్డు చూపుతున్న గద్యగుడ గ్రామస్థులు

రహదారి సౌకర్యం లేకుండా ఎన్నాళ్లీ అవస్థలు?

▸▸ ములసలవీధి గిరిజనులు ఆగ్రహం

సీలేరు, డిసెంబరు 26 , (ఆంధ్రజ్యోతి) : జీకేవీధి మండలం ధారకొండ పంచాయతీలోని ములసలవీధి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించాలని గిరిజనులు డిమాండ్ చేస్తున్నారు. ధారకొండ నుంచి ములసలవీధికి 2017 లో గిరిజన సం క్షేమ శాఖ మెటల్ రోడ్డును మంజూరు చేసిందని, ఆ తరువాత 2021లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కొత్తగా మళ్లీ నిధులు మంజూరు చేసినా, ఈ రోడ్డు పనుల ను దక్కించుకున్న కాంట్రాక్టర్ పనులను సంగంలోనే అసంపూర్తిగా నిలిపి వేసినట్టు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనిపై గత కలెక్టర్‌కు స్పందన కార్యక్రమంలో వినతి పత్రాలను ఇచ్చామని, ప్రస్తుతం ఉన్న కలెక్టర్ దృష్టికి కూడా ఈ రహదారి నిర్మాణం చేపట్టాలని కోరామని, అయినా, ఎటువంటి స్పందనలేదని వారు ఆరోపిస్తున్నారు. ప్రభుత్వాలు, అధికారులు మారుతున్నా తమ రహదారి కష్టాలు తీరడం లేదని వాపోతున్నారు. దీంతో గ్యామంలో అత్యవసర పరిస్థితుల్లో గర్భిణులను డోలీ మోతల్లో ఆసుపత్రికి తరలించాల్సివస్తోందని గిరిజనులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ములసలవీధి గ్రామానికి రహదారి సౌకర్యం కల్పించకపోతే ఆందోళన చేపడతామని గిరిజనులు హెచ్చరిస్తున్నారు.

గద్యగూడ గ్రామ వాసులు

డుంబ్రిగుడ: మండంలోని సాగర పంచాయతీ గద్యగూడ గ్రామానికి రోడ్డు సదుపాయంకల్పించాలని గ్రామస్థులు డిమాండ్ చేశారు. గురువారం గిరిజన సఘం నాయకులతో కలిసి ఆందోళన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా గిరిజన సంఘ నాయకుడు సూర్యనారాయణ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం కనీసం రోడ్డు సమస్య పట్టించుకోకపోవడంతో గద్యగూడ గ్రామస్తులు మండల కేంద్రానికి రాకపోకలు సాగించేందుకు ఇబ్బంది ఎదుర్కొంటున్నారు. గర్భిణులు, బాలింతలు ఆరోగ్య పరంగా సమస్యలపై వారిని తరలించడానికి యాతనపడుతున్నామన్నారు. ఈ నేపథ్యంలో కూటమి ప్రభుత్వం స్పందించి రోడ్డు నిర్మించాలని కోరారు.

పొగ మంచు బారిన పడకుండా అప్రమత్తంగా డ్రైవింగ్ చేయాలి

జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్


ఆర్‌టీవో లీలాప్రసాద్

పాడేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం పొగమంచు దట్టంగా కమ్ముకోవడంతో వాహనాల డ్రైవింగ్‌పై అత్యంత అప్రమత్తంగా ఉండాలని జిల్లా రవాణాధికారి లీలాప్రసాద్ సూచించారు. ఈమేరకు ఆయన గురువారం ఆయన విలేకరులతో మా ట్లాడుతూ, ప్రస్తుతం పొగమంచులో ప్రమాణాలు చేయకపోవడమే మేలని, తప్పనిసరి పరిస్థితుల్లో అయితే తగిన జాగ్రత్తలను విధిగా పాటించాలన్నారు.రోడ్డుకు ఎడమవైపు మాత్రమే వాహనాలు నడపాలని, గంటలకు 40 కిలోమీటర్ల వేగంతో వెళ్లడంతోపాటు సిగ్నల్స్‌ను కచ్చితంగా పాటించాలన్నారు. రాంగ్ పార్కింగ్ చేయవద్దని ప్రయాణాల్లో బైక్ రైడర్లు హెల్మెట్, కార్లలోని వాళ్లు సీట్ బెల్టులు విధిగా పెట్టుకోవాలన్నారు. ఎట్టిపరిస్థితుల్లోనూ మత్తుపదార్థాలు సేవించి డ్రైవింగ్ చేయవద్దని ఆయన హెచ్చరించారు. . తగిన జాగ్రత్తలు పాటిస్తే పొగమంచులో ప్రమాదాలకు ఆస్కారం లేకుండా ఉంటుందన్నారు.

మెనూ అమలు తప్పనిసరి


చుట్టుమెట్ట అంగన్‌వాడీలో బాలల బరువు పరిశీలిస్తున్న ఎంపీడీవో పూర్ణయ్య

పెదబయలు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అంగన్‌వాడీలు, పాఠశాలల్లో ప్రభుత్వం నిర్దేశించిన మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని ఎంపీడీవో ఎల్.పూర్ణయ్య అన్నారు. గురువారం ఆయన అరడకోట పంచాయతీ చుట్టుమెట్ట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను తనిఖీ చేశారు..ముందుగా అంగన్‌వాడీలో బాలల ఎత్తు, బరువు పరిశీలించారు. వయస్సుకు తగ్గ ఎత్తు, బరువు లేని పిల్లలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని సిబ్బందిని ఆదేశించారు. అనంతరం మెనూను పరిశీలించి సంతృప్తి వ్యక్తంచేశారు. అనంతరం పాఠశాలలో రికార్డులను, విద్యార్థుల హాజరు పట్టికను తనిఖీ చేశారు.

'అక్రమ నిర్మాణాలు తగదు'


తహశీల్దార్‌కు ఫిర్యాదు చేస్తున్న వైస్‌ఎంపీపీ కోండలరావు

హుకుంపేట డిసెంబరు 26 ఆంధ్రజ్యోతి; పలువురు గిరిజన నేతలు అ క్రమ చేపడుతున్న నిర్మాణాలు తక్షణమే నిలిపివేయాలని వైస్ ఎంపీపీ ఎస్. కోండలరావు కోరారు. గురువారం తహసీల్దార్ ప్రకాశ్‌ను కలిసి అక్రమ నిర్మాణాలపై పిర్యాదు చేశారు. గిజన నేతలు అక్రమంగా ఇళ్లు, దుకాణాలు, బహుళ అంతస్థుల నిర్మాణాలు చేపడుతున్నారన్నారు. 1/70 చట్టం, పెసా చట్టాలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఐటీడీఏ పీవో వీటిని కూల్చివేయాలని ఆదేశించినా ఎందుకు చర్యలు తీసుకోలేదని తహసీల్దార్‌ను ఆయన ప్రశ్నించారు. ఇప్పటికైనా స్పందించకుంటే గిరిజనులతో కలిసి వీటిని కూల్చివేస్తాన్నారు. పిలుపు నిచ్చారు. గిరిజన సంఘనేతలు పాల్గొన్నారు.

నేడు జీసీసీ చైర్మన్ పర్యటన

అనంతగిరి, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో శుక్రవారం జీసీసీ చైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ పర్యటించనున్నారు. ముందుగా కాశీపట్నం జీసీసీ గుడౌన్ పరిశీలించిన అనంతరం డీపోలను తనిఖీ చేయనున్నారు. జీసీసీ ద్వారా సరఫరా అవుతున్న నిత్యావసర సరకులు, బియ్యం, తదితర వాటిపై గిరిజనులను అడిగి తెలుసుకుంటారు.

పెంటావాలెంట్ వ్యాక్సినేషన్ శత శాతం పూర్తి చేయండి

డీఎంహెచ్‌వో షేక్ జమీల్ బాషా

పాడేరురూరల్, డిసెంబరు 26: ప్రభుత్వ ఆదేశాల మేరకు పెంటావాలెంట్ వ్యాక్సినేషన్ ప్ర క్రియ ఈ నెలాఖరులోగా శత శాతం పూర్తి చేయాలని వైద్య సిబ్బందికి డీఎంహెచ్‌వో షేక్ జమీల్‌బాషా ఆదేశించారు. మండలంలోని మినుములూరు పీహెచ్‌సీ పరిధి మారుమూల జీడిపగడ పీవీటీజీ గ్రామంలో గురువారం నిర్వహించిన చిన్నారుల వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాక్సిన్ వేసుకోని చిన్నారులు, అందుబాటులో లేక వారికి వైద్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు గుర్తించి ఈ నెల 31వ తేదీ లోగా వాక్సిన్లు పూర్తి చేయాలన్నారు. ప్రతీ చిన్నారి తల్లిదండ్రులు వ్యాక్సిన్లపై అవగాహన కలిగి ఉండాలన్నారు. గ్రామాల్లో ఉన్న గర్భిణులు, బాలింతలకు ఆస్పత్రి ప్రసవాల గురించి, రక్తహీనత రాకుండా పౌష్టికాహారం, పరసరాల పరిశుభ్రతను వివరించాలన్నారు. పాఠశాలలో విద్యార్థుల ఆరోగ్య తనిఖీలను పరిశీలించారు. అనంతరం మినుములూరు పీహెచ్‌సీని సందర్శించిన ఆయన ఆస్పత్రి రికార్డులను పరిశీలించారు. పీహెచ్‌సీలో ప్రసవాలుజరిగేలా చర్యలు తీసుకోవాలని వైద్యాధికారిణికి సూచించారు. పీహెచ్‌సీ మందుల నిల్వనుపరిశీలించారు. ఈ కార్యక్రమంలో బంగారుమెట్ట పంచాయతీ సర్పం చ్ మువ్వల మీనా, వైద్యాధికారిణి సాయిశ్రీ, ఆరోగ్య విస్తరణాధికారి గుల్లేలి సింహాద్రి, వైద్య సిబ్బంది కేవీకేఆర్‌కే. మూర్తి, ఎం.భవానీ, స్వర్ణలత, ఆశలున్నారు.

'గిరిజన ద్రోహి జడ్పీటీసీ నూకరాజు '

పాడేరురూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో గిరిజన ద్రోహి వైసీపీకి చెందిన కొయ్యూరు జడ్పీటీసీ సభ్యుడు వారా నూకరాజుకు ప్రజలే బుద్ధి చెబుతారని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర కార్యదర్శి బుగత బంగార్రావు, ఆదివాసీ పోరాట సంఘం అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, సీపీఐ ఎంఎల్ లిబరేషన్ అనకాపల్లి జిల్లా కార్యదర్శి సవరాల గణేష్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వైసీపీ నుంచి జడ్పీటీసీగా గెలిచి కొయ్యూరు మండలం నుంచి భూదందాలు నడిపిన నూకరాజు షెడ్యూల్ ప్రాంతంలోనూ గిరిజనేతరులకు భూమి పట్టాలు ఇవ్వాలని వాదిస్తున్నారన్నారు. షెడ్యూల్డ్ కులానికి చెందిన నూకరాజు తప్పుడు గిరిజనుడిగా ధ్రువీకరణ పత్రం పొంది దాని ఆధారంగా మన్యంలో పదవులు, ఆస్తులను ఆయన ఆర్జించాడన్నారు. అదే తప్పుడు కుల ధ్రువ పత్రంతో ఆయన కుమారుడికి ఉపాధ్యాయ ఉద్యోగం వచ్చేలా చేసుకున్నారని ఆరోపించారు. కొయ్యూరు, గొలగొండ మండలాల్లో ఆదివాసీల సాగు భూములను స్వాధీనం చేసుకొని గిరిజనేతరులకు అమ్ముకుంటూ రియల్ ఎస్టేట్ వ్యాపారిగా మారారన్నారు. వైసీపీ అధికారం కోల్పోయినా నూకరాజు ఆగడాలు మాత్రం నేటికి తగ్గడం లేదన్నారు. అనేక అక్రమాలకు పాల్పడుతున్న నూకరాజు ఇప్పటికైనా తీరుమార్చుకోకుంటే ప్రజలే చేతిలో గుణపాఠం తప్పదని హెచ్చరించారు.

ఎస్సీ కులగణనపై సోషల్ ఆడిట్ ప్రారంభం

పాడేరురూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ఎస్సీల జనాభా వారి వివరాలపై సోషల్ ఆడిట్ నిర్వహించాలని ప్రభుత్వం ఆదేశించినట్టు జిల్లా సాంఘిక సంక్షేమాధికారి జి.జనార్ధనరావు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు ప్రభుత్వం వద్ద ఉన్న ఎస్సీ కులగణన వివరాలను గురువారం నుంచి గ్రామ సచివాలయాల్లో ప్రదర్శించనున్నామన్నారు. 31వ తేదీ వరకు దానిపై అభ్యంతరాలను స్వీకరణ, జనవరి 6వ తేదీ వరకు వీటిని పరిశీలిస్తారన్నారు. సమగ్ర వివరాలు సేకరణ అనంతరం జనవరి 10వ తేదీన కులగణన తుది వివరాలను గ్రామ సచివాలయాల్లో ప్రదర్శిస్తారన్నారు.


రోడ్డు నిర్మాణానికి శంకుస్థాపన

ముంచంగిపుట్టు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మారుమూల లక్ష్మీపురం పంచాయతీ పరిధిలోని గ్రామాల్లో దశల వారీగా మౌలికసదుపాయాల కల్పనకు కృషి చేస్తానని సర్పంచ్ కె.త్రినాధ్ అన్నారు. గురువారం ఆయన ఆ పంచాయతీలోని కర్లాపొదర్ గ్రామంలో సీసీ రోడ్డు పనులక శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ గ్రామ పంచాయతీ 15వ ఆర్థిక సంఘం నిధులు రూ. 6 లక్షలు వెచ్చించి, సుమారు 120 మీటర్ల సీసీ రోడ్డు పనులను చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు వి.సాధురామ్, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

భూ సమస్యలపై 143 ఫిర్యాదులు

పాడేరురూరల్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి):భూ సమస్యలు పరిష్కారానికి జనవరి 10వ తేదీ వరకు నిర్వహిస్తున్న రెవెన్యూ సదస్సులను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వంజంగి త్రినాథరావు నాయుడు కోరారు. బుధవారం ఇరడాపల్లి పంచాయతీ కేంద్రంలో సదస్సు నిర్వహించారు. వివిధ గ్రామాల ప్రజలు అధిక సంఖ్యలో హాజరై భూ సమస్యలు, సరిహద్దుల సమస్యలు, మ్యుటేషన్‌ల సమస్యలపై 185 ఫిర్యాదులను అందించారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కా ర్యదర్శి, జీసీసీ డైరెక్టర్ బొర్రా నాగరాజు, ఇరడాపల్లి సర్పంచ్, గ్రామ పెద్దలు, డిప్యూటీ తహసీల్దార్ పి.పోలురాజు,ఎలక్షన్ డీటీ కె.లక్ష్మణమూర్తి, ఆర్ఐ బి.నల్లన్న, సర్వేయర్ వి.భీమయ్య, వీఆర్‌వో ఎం.రమణమ్మ, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

లారీ బోల్తా


సరుగుడు కలపతో బోల్తా పడిన లారీ

ముంచంగిపుట్టు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సుజనకోట పంచాయతీ కేంద్రం సమీపాన ముత్యాలమ్మ జంక్షన్ వద్ద గురువారం నీలగిరి కలప లోడుతో వెలుతున్న లారీ బోల్తా పడింది. డ్రైవర్‌కు స్వల్పగాయాలు తగిలాయి. నీలగిరి లోడుతో ఒడిశా కు వెళ్లేందుకు లారీ వస్తుండగా మలుపు వద్ద లారీ పక్కకు ఒరిగిపోయి, బోల్తా కొట్టింది. పరిమితికి మించి లోడుతోనే ప్రమాదం జరిగినట్టు స్థానికులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

గురుకుల ఉద్యోగుల నిరసన


మాట్లాడుతున్న ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాజబాబు


పాడేరురూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గిరిజన గురుకుల విద్యాలయాల్లో అవుట్ సోర్సింగ్ ఉద్యోగులుగా విధులు నిర్వహిస్తున్న గురువుల సమస్యలు పరిష్కరించాలని భారత్ ఆదివాసీ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు ఎం.రాంబాబు డిమాండ్ చేశారు. గురువారం ఆయన ఐటీడీఏ కార్యాలయం ఎదుట ఉద్యోగుల దీక్ష శిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గురుకుల విద్యాలయాల్లో ఏళ్ల తరబడి పని చేస్తున్న అవుట్ సోర్సింగ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులు తమను కాంట్రాక్టు ఉద్యోగులుగా మార్పు చేసి ఉద్యోగ భద్రత కల్పించాలని కోరుతూ 41 రోజులుగా రిలే నిరాహార దీక్షలు చేస్తున్న అధికారులు, కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం విచారకమన్నారు.

గిరిజనులను మోసగిస్తే చర్యలు: సీఐ


అపరాల వ్యాపారులతో సమావేశమైన సీఐ వరప్రసాద్

గూడెంకొత్తవీధి, డిసెంబరు 26 , (ఆంధ్రజ్యోతి) : గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా తీసుకుని మోసాలకు పాల్పడినట్లు తమ దృష్టికి వస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జీకేవీధి సీఐ అపరాల వ్యాపారస్తులను హెచ్చరించారు. గురువారం జీకేవీధిలోని తన కార్యాలయంలో వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ యన మాట్లాడుతూ మారుమూల గ్రామాల్లో గిరిజన రైతులు పండించిన అపరాలకు గిట్టుబాటు ధర చెల్లించాలన్నారు. తూనికలు, కొలతల్లో మోసాలకు పాల్పడరాదన్నారు. కాఫీ, రాజ్‌మా, చిక్కుళ్ళు మినుములు తదితర పంటలను దళారులు ఎక్కువ ధరలకు కొనుగోలు చేస్తామని చెప్పి తూనికల్లో గిరిజనులను మోసగిస్తున్నట్టు తమ దృష్టికి వచ్చిదన్నారు. ఇలాంటి విధానాలకు స్వస్తి పలికి గిట్టుబాటు ధరలను కల్పించాలని సీఐ వ్యాపారులకు సూచించారు.

ఆకాశం ఎందుకో ఎర్రబడ్డది..


పాడేరు మండలం డల్లాపల్లి వద్ద గురువారం సాయంత్రం ఎర్రబడిన ఆకాశం

మండలంలో గురువారం ఆకాశం ఎందుకో ఎర్రబడింది. అల్పపీడనం ప్రభావంతో గత కొన్ని రోజులుగా ఆకాశం మేఘావృతమై ఉంటోంది. కాగా గురువారం ముసురు తగ్గడంతో ఎండకాసింది. దీంతో సాయంసంధ్య వేళలో ఆకాశం ఎర్రబడిన దృశ్యం ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంది.

- పాడేరు/ఆంధ్రజ్యోతి

జాతీయ ఆహార భద్రతా పథకం ద్వారా రాయితీపై విత్తనాలు

చింతపల్లి, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : జాతీయ ఆహార భద్రతా పథకంలో భాగంగా గిరిజన రైతులకు అధిక దిగుబడినిచ్చే పలు రకాల పంటలను పరిచయం చేస్తున్నామని చింతపల్లి మండల వ్యవసాయాధికారి శ్రీనివాస్ అన్నారు. గురువారంపోతురాజుగున్నాల, మల్లవరం గ్రామాల్లో రైతులతో సమావేశాలను నిర్వహించారు. అధిక దిగుబడినిచ్చే స్వల్పకాలిక ఆధునిక వరి వంగడాలను రైతులకు రాయితీపై పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వరుసలో వరినాట్లు, కాలిబాటలు తీయడం, రాడోమొనాస్‌తో విత్తన శుద్ధి, సకాలంలో కలుపు యాజమాన్యం విధానాలపై గిరిజనాలకు అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న ఏవో శ్రీనివాస్

పొలం పిలుస్తోంది..

గూడెంకొత్తవీధి: మండలంలోని సిగనపల్లి, ఎర్నపల్లి గ్రామాల్లో గురువారం పొలం పిలుస్తోంది కార్యక్రమం ఏవో మధుసూదనరావు ఆ ధ్వర్యంలో నిర్వహించారు. రైతులు రాజ్‌మా పంటకు బీమా చేయించుకోవాలని, వర్షాలతో పొలంలో మొలకలు వచ్చే అవకాశం ఉన్నందున జాగ్రత్తలను పాటించాలని సూచిం చారు. రాజ్‌మాకు ఈ క్రాప్ బుకిం గ్ కోసం వ్యవసాయ, ఉద్యానవన సహాయకులను సంప్ర దించాలన్నారు. సాగిన బాలరాజు, పశుసంవర్ధక సహాయకుడు రాజుబాబు పాల్గొన్నారు.

మారెమ్మ అమ్మవారికి వెండి కిరీటం బహూకరణ


కిరీటం అందిస్తున్న కొరసాల సాయివినీల్ కాంత్, జాస్మిని దంపతులు

సీలేరు, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): జీకేవీధి మండలం సీలేరు గ్రామదేవత మారెమ్మ అమ్మవారికి తుని పట్టణానికి చెందిన కొరసాల సాయి వినీల్‌కాంత్, జాస్మిని దంపతులు గురువారం వెండి కిరీటాన్ని బహూకరించారు. ముందుగా అమ్మవారి సన్నిధిలో ప్రత్యేక పూజలను నిర్వహించి అనంత రం ఆ కిరీటాన్ని ఆ లయ పూజా రి దామోదర స్వామికి అందజేశారు. ఈ సందర్భంగా వారు మా ట్లాడుతూ గతంలో ఆలయ దర్శనానికి వచ్చినప్పుడు అమ్మవారికి మొక్కుకున్న మేరకు కిరీటాన్ని అందించామన్నారు. ఈ కిరీటానికి ప్రత్యేక పూజలు అనంతరం అమ్మవారికి అలంకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు కారే శ్రీనివాస్, వానపల్లి అప్పారావు, జెన్‌కో రిటైర్డ్ ఉద్యోగి గణేష్ పాల్గొన్నారు.

వంగవీటి మోహన్‌రంగా వర్ధంతి


కాపునాడు సంఘం ఆధ్వర్యంలో పేదలకు ఆహార పొట్లాలను అందిస్తున్న దృశ్యం

చింతపల్లి, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి) : చింతపల్లి లో గురువారం వంగవీటి మోహన్‌రంగా 36 వ వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలను వేసి నివాళులు అర్పించారు. చింతపల్లి కాపునాడు సంఘం ఆధ్వర్యంలో పేదలకు అన్నసమారాధన కార్యక్రమంను నిర్వహించారు. బడుగు , బలహీన వర్గాల ఆశాజ్యోతి స్వర్గీయ వంగవీటి మోహనరంగా అని కాపునాడు నాయకులు ఈ సందర్భంగా కొనియాడారు. ఈ కార్యక్రమంలో కాపునాడు జిల్లా అధ్యక్షుడు దూనబోయిన రమణ, చింతపల్లి మండల అధ్యక్షుడు గాజుల శ్రీను, హరి నాగు, తరుణ్, లోవ, స్వామి తదితర్లు పాల్గొన్నారు.

పంటలకు నష్ట పరిహారం చెల్లించాలి


వర్షాలకు దెబ్బతిన్న పంటలను చూపుతున్న గిరిజన రైతులు

సీలేరు, డిసెంబరు 26 (ఆం ధ్రజ్యోతి): జీకేవీధి మండలం గాలికొండ, అమ్మవారి ధారకొండ పంచాయతీల్లో గిరిజన రైతులు సాగు చేస్తున్న రాజ్మా, పెసలు, మినుములు, కాఫీ, వరి పంటలు ఇటీవల కురిసిన అకాల వర్షాలకు తీవ్రమైన సష్టం వాటిల్లిందని గిరిజన రైతులు కాకూరి రాజారావు, పలాసి ఇర్మి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. గతంలో జీకేవీధి మండలం లో చట్రాపల్లి గ్రామంలో భారీ వర్షాలకు కొండచరియలు విరిగిపడి కాఫీ తోటలు ధ్వంస మైన సమయంలో ఈప్రాంతాన్ని సందర్శించిన ఐటీడీఏ పీఓ కాఫీ తోటలకు నష్టపరిహారం రాదని, రాజ్‌మా పంటలకు నష్ట పరిహారంవస్తుందని చెప్పారన్నారు. దీంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా పంపిణీ చేసిన రాజ్‌మా విత్తనాలను నాట్లు వేశామని, పంట చేతికి అంది వచ్చే సమయంలో ఇటీవలగా కురుస్తున్న భారీ వర్షాలకు పంటలు అన్నీ పోయాయని, వెంటనే సంబంధిత అధికారులను తమ గ్రామాలను పంపించి పంట నష్టాలను అంచనా వేసి పరిహారాన్ని చెల్లించి గిరిజన రైతులు కోరుతున్నారు.

ఘనంగా సీపీఐ ఆవిర్భావ దినోత్సవం


కొయ్యూరులో పార్టీ జెండా ఆవిష్కరించి నినాదాలు చేస్తున్న నాయకులు

కొయ్యూరు, డిసెంబ రు 26 : సీపీఐ చేసిన పోరాటాల ఫలితంగానే భూమి లేని నిరు పేదలకు వేలాది ఎక రాల భూమి పంపిణీ జరిగిందని ఆపార్టీ జిల్లా కార్యదర్శి పొట్టిక సత్యనారాయణ అన్నారు. పార్టీ శతాధిక ఆవిర్భావ దినోత్సవాన్ని గురువారం మండలం లో అంతాడ పంచాయతీ మునసల గ్రామంలో పార్టీ మండల అధ్యక్షుడు ఇరవాడ దేముడు అధ్యక్షతన ఘనంగా నిర్వహించారు.

చింతపల్లి: సీపీఐ వార్షికోత్సవం చింతపల్లిలో సీపీఐ నాయకులు ఘనంగా వేడుకలను నిర్వహించారు. సీపీఐ మండల కార్యదర్శి పేట్ల పోతురాజు ఆధ్వర్యంలో పాత బస్‌స్టాండ్ కూడలి వద్ద గల స్థూపంపై పార్టీ తోరణాలు అలంకరించారు. అనంతరం నాయకులు జెండాను ఎగురవేసారు. ఉప సర్పంచ్ గంజారి రమణ, సీనియర్ నాయకులు పొత్తూరి చిన్నారావు, అప్పారావు,అప్పలనాయుడు పాల్గొన్నారు.

సీలేరు : జీకేవీధి మండలం ధారకొండ లో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు సుంకరి విష్ణుమూర్తి ఆధ్వర్యంలో గ్రామంలోని హనుమాన్ జంక్షన్ వద్ద కార్యకర్తలతో సమావేశను ఏర్పాటు చేశారు. అనంతరం అక్కడ పార్టీ జెండాను నాయకుడు కొడా త్రినాధ్ ఆవిష్కరించారు.

బాల్య వివాహాలను నియంత్రించాలి

గూడెంకొత్తవీధి, డిసెంబరు 26 , (ఆంధ్రజ్యోతి) : మండలంలో బాల్య వివాహాల నివారణపై ఎంపీడీఓ ఉమామహేశ్వరరావు అధ్యక్షతన గురువారం వివిధ శాఖల అధికార్లతో సమావేశం నిర్వహించారు. ప్రతీ నెల మొదటి వారంలో మొదటి శుక్రవారం గ్రామస్థాయిలో బాల్య వివాహాల నివారణ అవగాహన కమిటీ ఆధ్వర్యంలో సమావేశంను నిర్వహించాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీడీపీఓ లక్ష్మీ, ఎస్ఐ అప్పలసూరి, వైద్యాధికార్లు అత్యుత్, వినయ్‌కుమార్, తదితర్లు పాల్గొన్నార

అధికారులు హాజరు కాకుంటే సమస్యలు ఎవరికి చెప్పుకోవాలి?

» నర్సీపట్నం మండల సమావేశంలో పలువురు సభ్యులు ఆగ్రహం » కలెక్టర్ దృష్టికి తీసుకు వెళతామన్న ఎంపీపీ రాజేశ్వరి » కూటమి ప్రభుత్వంలో గ్రామాల అభివృద్ధే లక్ష్యమన్న జడ్పీటీసీ రమణమ్మ

నర్సీపట్నం అర్బన్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి వేదికైన మండల సర్వసభ్య సమావేశానికి ఆయా శాఖల అధికారులు హాజరు కాకుండా దిగువస్థాయి సిబ్బందిని పంపితే తాము సమస్యలు ఎవరికి చెప్పుకోవాలని పలువురు సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. నర్సీపట్నం మండల సర్వసభ్య సమావేశం ఎంపీపీ సుర్ల రాజేశ్వరి అధ్యక్షతన గురువారం ఇక్కడ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు పలువురు సభ్యులు మాట్లాడుతూ మూడు నెలలకు ఒకసారి నిర్వహించే మండల సమావేశానికి మండల స్థాయి అధికారులు మాత్రమే హాజరు కావాల్సింది ఉందన్నారు. కానీ కిందిస్థాయి సిబ్బందిని కొందరు పంపుతుండడం తగదన్నారు. సమావేశానికి హాజరు కాని అధికారులపై చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్‌కు నివేదించనున్నట్టు ఎంపీపీ తెలిపారు. అనంతరం ఉపాధి హామీ పథకం ఏపీవో సత్యవతి





సభ్యులను ఉద్దేశించి మాట్లాడుతున్న ఎంపీపీ రాజేశ్వరి, చిత్రంలో జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ

తమ శాఖ పురోగతిని వివరిస్తుండగా, జడ్పీటీసీ సభ్యురాలు సుకల రమణమ్మ మాట్లాడుతూ రైతులకు అవసరమైన టేకు, సరుగుడు నారును అందించాలని కోరారు. వేములపూడి ఎంపీటీసీ సభ్యుడు బోళెం రామ్‌ప్రసాద్ మాట్లాడుతూ గడ్డి పెంపకానికి సంబంధించి అందరికీ భూములు ఉండవు కనుక, భూమిని లీజుకు తీసుకున్న రైతులకు ఈ పథకాన్ని అమలు చేయాలని కోరారు. అనంతరం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కె.రాహుల్ మాట్లాడుతూ గ్రామాల్లో గల వాటర్ ట్యాంకులకు వారానికి ఒకరోజు క్లోరినేషన్ చేయించి ప్రజలకు మంచి నీరు అందించాలని సిబ్బందికి సూచించినట్టు చెప్పారు. వ్యవసాయ శాఖ తరపున ఆ శాఖ ఏవో హాజరు కాకపోవడంతో ఆయన తరపున అసిస్టెంట్ విచ్చేశారు. దీంతో గబ్బాడ సర్పంచ్ రాజేశ్వరి, ధర్మసాగరం సర్పంచ్ గొంప కన్నయ్యనాయుడు తదితరులు అభ్యంతరం తెలిపారు. అసలే ఇటీవల అల్పపీడనం కారణంగా పలుచోట్ల వరిపంట పాడైందని, ఈ సమస్యను ఆయన దృష్టికి తీసుకు వెళ్లాలని భావిస్తే ఏవో సమావేశానికి హాజరు కాకపోతే ఎలా.. అని ప్రశ్నించారు. ఇటీవల కురిసిన వర్షాల కారణంగా వరిపంట తీవ్రంగా నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాల్సిందిగా వారు కోరారు. గురందొరపాలెం సర్పంచ్ శానాపతి వెంకటరత్నం మాట్లాడుతూ తమ గ్రామ రెవెన్యూ పరిధి ఎక్కువగా ఉందన్నారు. ప్రస్తుతం ఉన్న వీఆర్‌వో సరిగా పనిచేయడం లేదని వేరొకరిని నియమించాలని కోరారు. అలాగే గురందొరపాలెంలో సచివాలయ భవన నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావచ్చి నిలిచిపోయాయని, ఆ పనులు పూర్తి చేసేందుకు నిధులు మంజూరు చేయాలని కోరారు. అనంతర పరిణామంపై గబ్బాడ సర్పంచ్ రాజేశ్వరి మాట్లాడుతూ గత వైసీపీ పాలనలో కనీసం సమావేశాల్లో మాట్లాడడానికి కూడా తమకు అవకాశం ఇచ్చేవారు కాదన్నారు. అయినప్పటికీ కూటమి ప్రభుత్వంలో రాజకీయాలకు అతీతంగా అభివృద్ధి, సంక్షేమ పథకాలకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. అనంతరం గబ్బాడ సర్పంచ్ రాజేశ్వరి, జడ్పీటీసీ సుకల రమణమ్మలతో గురందొరపాలెం సర్పంచ్ వెంకటరత్నం మాట్లాడుతున్న సమయంలో వారి మధ్య స్వల్ప వాగ్వాదం చోటుచేసుకుంది. ఈ సమావేశంలో ఎంపీడీవో కె.ఉషశ్రీ, వైస్ ఎంపీపీ కె.తాతబాబు, హెచ్‌డీటీ నరేంద్రలతో పాటు పలువురు అధికారులు, సర్పంచులు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలపై 'వంగవీటి' అలుపెరుగని పోరాటం


రంగా విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

నర్సీపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వంగవీటి మోహన్‌రంగా ఆశయ సాధనకు అంతా కృషి చేయాలని డీసీసీ అధ్యక్షుడు మీసాల సుబ్బన్న పిలుపునిచ్చారు. రంగా 36వ వర్ధంతి సందర్భంగా గురువారం పట్టణంలోని రామారావుపేటలో గల ఆయన విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం సుబ్బన్న మాట్లాడుతూ ప్రజా సమస్యలపై రంగా అలుపెరుగని పోరాటం సాగించారని వివరించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ వైస్ చైర్మన్ కోనేటి రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు. అలాగే, కాపువీధిలో రంగా వర్ధంతి కార్యక్రమాన్ని నిర్వహించి నివాళులర్పించారు.

చోద్యం పీఏసీఎస్‌లో వ్యవహారంపై విచారణ వాయిదా


చోద్యం పీఏసీఎస్‌లో విచారణకు హాజరైన అధికారులు

గొలుగొండ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) చోద్యం పీఏసీఎస్‌లో 'ఒక ఉద్యోగం-రెండు జీతాలు' శీర్షికతో ఇటీవల 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనంపై గురువారం చేపట్టాల్సిన విచారణ వాయిదా పడింది. తొలుత జిల్లా కో-ఆపరేటివ్ అధికారిణి స్వరూపారాణి ఆదేశాల మేరకు నర్సీపట్నం సబ్ డివిజనల్ కో-ఆపరేటివ్ ఆఫీసర్ ఎస్.సత్యనారాయణ విచ్చేసి విచారణ ప్రారంభించారు. అంతలోనే డీసీసీబీ ఉన్నతాధికారులు విచారణ నిలిపివేయాలని తమను ఫోన్‌లో ఆదేశించారని కో-ఆపరేటివ్ ఆఫీసర్ సత్యనారాయణ విలేకరులకు తెలిపారు. దీనిపై సెంట్రల్ బ్యాంకు సీఈవోను విచారణాధికారిగా నియమించినట్టు చెప్పారు.

గబ్బాడలో సీపీఐ ఆవిర్భావ దినోత్సవం

నర్సీపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : సీపీఐ వందో ఆవిర్భావ దినోత్సవాన్ని మండలంలోని గబ్బాడలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ పార్టీ జిల్లా సహాయ కార్యదర్శి మాకిరెడ్డి రామునాయుడు ఆధ్వర్యంలో పతాకాన్ని ఆవిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సీపీఐ సిద్ధాంతాలు, ఆశయాలకు కార్యకర్తలంతా కట్టుబడి ప్రజల పక్షాన పనిచేయాలని పిలుపునిచ్చారు. వందేళ్ల పార్టీ చరిత్రలో అనేక ఉద్యమాలలో చురుకైన పాత్ర పోషించినట్టు చెప్పారు. భవిష్యత్తులో శ్రేణులంతా ఇదే స్ఫూర్తిని కొనసాగించాలన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు ఎస్.శ్రీరామమూర్తి, గురుబాబు, గంగా భవానీ తదితరులు పాల్గొన్నారు.

కోడిపందాలు ఆడుతున్న ఇద్దరిపై కేసు

కృష్ణాదేవిపేట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కోడి పందాలు ఆడుతున్న ఇద్దరు వ్యక్తులపై కేసు నమోదు చేసినట్టు కృష్ణాదేవిపేట ఎస్ఐ వై.తారకేశ్వరరావు తెలిపారు. గొలుగొండ మండలం పాత కృష్ణాపేటలో కోడిపందాలు ఆడుతున్నట్టు గురువారం సాయంత్రం ముందస్తు సమాచారం అందిందన్నారు. ఈ మేరకు సిబ్బందితో వెళ్లి దాడిచేసి ఇద్దరు వ్యక్తులను అదుపులోకి తీసుకుని రెండు కోడిపుంజులు, రూ.320 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

ప్రభుత్వ భూమి ఆక్రమణపై అధికారులు సీరియస్

» నాటిన మొక్కలను తొలగించిన రెవెన్యూ సిబ్బంది

మాకవరపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామన్నపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జాచేసి, అందులో నాటిన సరుగుడు మొక్కలను రెవెన్యూ అధికారులు తొలగించారు. 'రామన్నపాలెంలో ప్రభుత్వ భూమి కబ్జా' శీర్షికతో గురువారం 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనానికి అధికారులు వెనువెంటనే స్పందించారు. ఈ నేపథ్యంతో వీర్‌వోలు సాంబ, సూరిబాబు అక్కడకు వెళ్లి ఆక్రమణలో ఉన్న భూమిని గుర్తించారు. అందులో నాటిన మొక్కలను పీకేశారు. అనంతరం ఆక్రమణ రైతును పిలిచి ఇది ప్రభుత్వ భూమి అని ఆక్రమణ నేరమని తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ కేసులు తప్పవని హెచ్చరించారు.


ఆక్రమించి చదును చేసిన భూమిని పరిశీలిస్తున్న రెవెన్యూ సిబ్బంది

ఈ భూమికి సంబంధించి ఏవైనా ఆధారాలు ఉంటే రెవెన్యూ కార్యాలయానికి వచ్చి తహసీల్దార్‌కు చూపించాల్సిందిగా సూచించారు.

'సాగునీటి సంఘాల ఎన్నికల్లో వ్యతిరేకంగా పనిచేసిన టీడీపీ నాయకుడు సస్పెన్షన్'

మాకవరపాలెం, డిసెంబరు26(ఆంధ్రజ్యోతి) : సాగునీటి సంఘాల ఎన్నికల్లో టీడీపీకి వ్యతిరేకంగా పనిచేసిన పైడిపాలకు చెందిన ఆ పార్టీ నాయకుడు ఆర్.నర్సింగరావును సస్పెండ్ చేసినట్టు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్‌వై పాత్రుడు గురువారం ఇక్కడ విలేకరులకు తెలిపారు. ఇటీవల జరిగిన సాగునీటి సంఘాల ఎన్నికల్లో వైసీపీ నాయకులతో కలిసి టీడీపీ బలపరిచిన అభ్యర్థికి వ్యతిరేకంగా పనిచేయడంతో పార్టీ పెద్దల ఆదేశాల మేరకు ఈ చర్యలు తీసుకున్నట్టు చెప్పారు.

కూటమి సర్కారుపై తప్పుడు ఆరోపణలు సహించం

» మాజీ ఎమ్మెల్యే గణేశ్‌కు టీడీపీ నాయకులు హెచ్చరిక

మాకవరపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : కూటమి ప్రభుత్వంపై తప్పుడు ఆరోపణలు చేస్తే చూస్తూ ఊరుకోబోమని నర్సీపట్నం మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేశ్‌కు టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు, నాయకులు అల్లు రామునాయుడు, శీరంరెడ్డి చినబాబు హెచ్చరించారు. గురువారం ఇక్కడ వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ అధికారం కోల్పోవడంతో మాజీ ఎమ్మెల్యే పెట్ల మతి స్థిమితం లేకుండా మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. గిడుతూరు నుంచి సుంకపూర్ రోడ్డుకి కూటమి అధికారంలోకి రాగానే గత నెల నాలుగో తేదీన టెండరు ఖరారు చేసిందన్నారు. దీంతో ఈ నెల 24వ తేదీన ఆ రోడ్డు పనులను శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రారంభించారన్నారు. కానీ వైసీపీ ప్రభుత్వ హయాంలో ఈ టెండరు పూర్తయ్యిందని మాజీ ఎమ్మెల్యే చెపుతుండడం వారి దిగజారుడుతనానికి నిదర్శనంగా పేర్కొన్నారు. వైసీపీ ప్రభుత్వంలో మంజూరైన గ్రామ సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు, హెల్త్ సెంటర్ల భవనాలు ఇంకా ఎందుకు పూర్తికాలేదో సమాధానం చెప్పాలని వారు డిమాండ్ చేశారు. వైసీపీ ప్రభుత్వంలో ఇదే రోడ్డు నిర్మాణానికి రెండుసార్లు


సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ మండల అధ్యక్షుడు ఆర్.వై.పాత్రుడు

టెండర్లు పిలిచినా టెండర్లు వేసేందుకు ఎవరూ ముందుకు రాలేదంటే మీరు ఎలాంటి పాలన అందించారో ఇట్టే అర్థం చేసుకోవచ్చునని ఎద్దేవా చేశారు. మండలంలో రెండు కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులు చేస్తున్నట్టు చెప్పారు. రాష్ట్రాభివృద్ధి, ప్రజా సమక్షేమమే లక్ష్యంగా పాలన సాగిస్తున్న కూటమి ప్రభుత్వంపై ఇష్టారాజ్యంగా మాట్లాడితే సహించేదిలేదని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో గిడుతూరు సాగునీటి సంఘం అధ్యక్షుడు దొరబాబు, టీడీపీ సీనియర్ నాయకులు గోవింద, శంకరగిరి పాల్గొన్నారు.

బీజేపీ మండల కమిటీ ఎన్నికలో వివాదం.. వాయిదా

మాకవరపాలెం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రాచపల్లి సెంటరులో నిర్వహించిన బీజేపీ మండల కమిటీ ఎన్నికల్లో వివాదం చేలరేగింది. ఇక్కడి కామేశ్వరమ్మ గుడి వద్ద గురువారం మండల కమిటీ ఎన్నిక సందర్భంగా సమావేశాన్ని నిర్వహించారు. అయితే కమిటీ ఎన్నికకు ఏర్పాటు చేసిన బూత్ కమిటీలో కొందరు మోసానికి పాల్పడ్డారని ఆ పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు అడిగర్ల రాంబాబుతో పాటు మరికొంత మంది అక్కడకు వచ్చిన నాయకులను నిలదీశారు. దీంతో కొంతసేపు వాగ్వాదం చోటుచేసుకుంది. మండల కమిటీ అధ్యక్షుడిగా పాతవారిని తొలగించి, కొత్తవారిని ఎంపిక చేయాలని రాంబాబు పట్టుబట్టారు. దీంతో ఇరువర్గాల మధ్య ఎంతసేపటికీ సమన్వం కుదరలేదు. చేసేది లేక చివరకు జిల్లా కమిటీ సభ్యులు ఎన్నిక వాయిదా వేసి అక్కడి నుంచి వెళ్లిపోయారు.

కొండపాలెం ఫీల్డ్ అసిస్టెంట్‌పై విచారణ


ఫీల్డ్ అసిస్టెంట్ రమణను విచారిస్తున్న ఎంపీడీఓ నాగేశ్వరరావు

రోలుగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కొండపాలెంలో జరిగిన ఉపాధి హామీ పనుల్లో అవకతవకలపై వచ్చిన ఫిర్యాదుపై గురువారం ఎంపీడీవో నాగేశ్వరరావు విచారణ చేపట్టారు. గ్రామానికి చెందిన పోతు గణేష్, బంటు నాయుడుబాబు, కర్రి శ్రీనివాసరావు, బంటు పరదేశు తదితరులు తాము ఉపాధి పనులకు హాజరు కాకున్నా తమ పేరున మస్టర్లు నమోదు చేసి బ్యాంకు ఖాతాల్లో సొమ్ము జమచేశారని ఫిర్యాదు చేశారు. ఈ మేరకు ఫీల్డ్ అసిస్టెంట్ రమణను ఫిర్యాదుదారుల సమక్షంలో ఏపీఓ నాగేశ్వరరావుతో కలిసి విచారణ చేపట్టారు. ఉపాధి కూలీలను పిలిపించి నివేదిక తీసుకున్నారు. గత సెప్టెంబరులో జరిగిన మండల ప్రజావేదికలో ఫిర్యాదు చేశామని, నేటికీ ఎటువంటి చర్యలు తీసుకోలేదని ఈ సందర్భంగా ఆరోపించారు. విచారణ నివేదికను ఉన్నతాధికారులకు నివేదిస్తామని, తదుపరి చర్యలు తీసుకుంటామని ఎంపీడీవో తెలిపారు. ఈ కార్యక్రమంలో టెక్నికల్ అసిస్టెంట్ దినేశ్, ఉపసర్పంచ్ బంటు చిరంజీవి, మాజీ సర్పంచ్ బంటు సూర్యసన్యాసిదేముళ్లు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్ సమస్యలపై జిల్లా అధికారులకు నివేదిక


చీడికాడలో అంగన్‌వాడీలతో మాట్లాడుతున్న ఎంపీడీవో హేమసుందరరావు

చీడికాడ, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): స్థానిక బీసీ బాలికల హాస్టల్‌లో సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులకు నివేదిక అందజేస్తానని ఎంపీడీవో హేమసుందరరావు తెలిపారు. ఈ వసతి గృహం, అంగన్‌వాడీ కేంద్రాలను గురువారం ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా బాలికల వసతిగృహంలో 95మంది విద్యార్థినులు ఉండగా, సొంత భవనం లేకపోవడంతో ఒకే గదిలో భోజనాలు, చదువుకోవడం, నిద్ర వంటివి చేస్తున్నట్టు ఆయన గుర్తించారు. విద్యార్థినులకు ఐదు మరుగుదొడ్లు, ఐదు స్నానాల గదులు ఉన్నాయన్నారు. వీటన్నింటిపైనా జిల్లా అధికారులకు నివేదిస్తానన్నారు. అనంతరంఅంగన్‌వాడీ కేంద్రాన్ని తనిఖీచేసి చిన్నారులతో మాట్లాడారు. మెనూ పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని ఆదేశించారు. ఆయన వెంట చీడికాడ పంచాయతీ కార్యదర్శి ఎ.సన్యాసిరావు పాల్గొన్నారు.

అసైన్‌మెంట్ భూములను ఫ్రీహోల్డ్ భూములుగా మార్చండి


వైబీపట్నం రెవెన్యూ సదస్సులో దరఖాస్తు ఇస్తున్న అప్పారావు

రోలుగుంట, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి):వైబీపట్నంలో నిర్వహించిన రెవెన్యూ సదస్సులో గత 23 ఏళ్లగా సాగుచేసుకుంటున్న తమ అసైన్‌మెంట్ భూమిని ఫ్రీహోల్డ్‌గా మార్చాలని కోరుతూ, పలువురు రైతులు గురువారం అర్జీలను అందించారు. శరభవరానికి చెందిన ఎత్తుల అప్పారావు తనకు ప్రభుత్వం వైబీపట్నం రెవెన్యూలో 2.06 సెంట్ల అసైన్‌మెంట్ భూమికి 23 ఏళ్ల క్రితం పట్టా ఇచ్చిందని అప్పటి నుంచి సాగుచేసుకుంటూ జీవనం సాగిస్తున్నామన్నారు. ప్రస్తుతం ఫ్రీహోల్డ్ కింద మారిస్తే ఈ భూమితో బ్యాంకుల్లో రుణాలు, రాయితీల అవకాశం ఉంటుందని విన్నవించారు.విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటామని హామీ తహసీల్దార్ ఇచ్చారు. ఈ సదస్సులో ఆర్ఐ రామమూర్తి తదితరులు పాల్గొన్నారు.

నీటి వసతి ఉన్న గ్రామాల్లో రబీ సాగుకు సన్నద్ధం


కొమిరలో వరి నాట్లు వేసేందుకు దమ్ము చేసిన రైతులు


ఎదిగిన వరినారు

రావికమతం, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి):మండలంలోని పలు గ్రామాల్లో రబీ వరి సాగుకు రైతులు సన్నద్ధమవుతున్నారు. బోరులు, బావులు, చెరువులు ఉన్న చోట్ల రైతులు దమ్ములు చేపడుతున్నారు. ఈ ఏడాదిలో వర్షాలు ఆశాజనకంగా కురవడం ఖరీఫ్‌లో రైతులు ఆశించిన స్థాయిలో పంట పండింది.అలాగే, వర్షాలకు చెరువులు,బావులు పూర్తిగా నిండి భూగర్భ జలాలు పెరిగాయి. దీంతో రబీ సాగును నీటి వనరులు అందుబాటులో చోట్ల చేపడుతున్నారు. శ్రీకాకుళం సన్నాలు, 1001, జయ, తెలంగాణ సన్నాలు తదితర స్వల్పకాలిక వరి రకాలను వేస్తున్నారు. మట్టవానిపాలెం, గుడివాడ, దాసరయ్యపాలెం, మేడివాడ, కొమిర, మత్స్యపురం, కేబీపీ అగ్రహారం తదితర గ్రామాలలో సుమారు 100 హెక్టార్లతో ఈ ఏడాది రబీ సాగును రైతులు వేస్తున్నారు. గతంలో ఎప్పుడు 10 హెక్టార్లకు మించి రబీ సాగు జరిగేదికాదు. చెరకు ధర కంటే ప్రస్తుతం ధాన్యానికి ధర బాగుండడంతో రైతులు ఈ సాగుపై ఆసక్తి కనబరుస్తున్నారు.

రంగు మారిన ధాన్యం కొనుగోలు


రైతులకు సూచలను ఇస్తున్న ఏవో వాసుదేవరావు

మాడుగుల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : వర్షాలతో తడిచిన ధాన్యం ప్రభుత్వం కొనుగోలు చేసేందుకు సిద్ధంగా ఉందని మండల వ్యవసాయాధికారి వాసుదేవరావు తెలిపారు. గురువారం జాలంపల్లి, పొంగలిపాక గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు పలు సూచనలందించారు. రంగుమారిన ధాన్యంలో తేమశాతం 20శాతం ఉన్నప్పటికీ వాటిని కొనుగోలు కేంద్రాల ద్వారా కనీస మద్దతు ధర అందించనున్నట్టు చెప్పారు. ఈ ఖరీఫ్ లో మండలంలో 4419 హెక్టార్లలో వరి పంట సాగు చేశారని, ఇందులో 3690 హెక్టార్లలో వరిపంట కోత పూర్తయిందన్నారు. ఈ నెల 15 తర్వాత కోతలు కోసిన వరిపంట వర్షాలకు 200 హెక్టార్లలో తడిసినట్టు గుర్తించామన్నారు. ప్రభుత్వం వరికి క్వింటా రూ. 2300 చొప్పున మద్దతు ధర కల్పించిందన్నారు. ఈ కార్యక్రమంలో సిబ్బంది గౌరి నాయుడు, గుణమ్మ, రైతులు పాల్గొన్నారు.

'గ్రానైట్ లారీల రాకపోకల అడ్డగింపు తప్పదు'

రావికమతం, డిసెంబరు 26, (ఆంధ్రజ్యోతి): రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు క్వారీ లారీల రాక పోకలు నిలుపు చేయకుంటే వాటిని ప్రజలే అడ్డుకుంటారని టీడీపీ మండల అధ్యక్షులు రాజాన కొండ నాయుడు హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన గురువారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ, చినపాచిల నుంచి టి.అర్జాపురం వరకూ ఉన్న 14 కిలోమీటర్ల రింగు రోడ్డు నిర్మాణ పనులు రూ 7.80 కోట్లతో జరుగుతున్నాయన్నారు. అయితే, రహదారిలో కొట్నాబిల్లి పరిధిలో మహి.ఎస్‌కె గ్రానైట్ క్వారీలకు చెందిన లారీలు పరిమితికి మించిన బరువుతో రాకపోకలు సాగిస్తున్నాయన్నారు.వీటికి తోడుగా వర్షాలు పడుతున్నందున రోడ్డు ఇప్పటికే బురద మయంగా మారిందన్నారు. రోడ్డు నిర్మాణ పనులకు లారీలతో ఆటంకం కలగడమే కాక పనుల్లో నాణ్యత లోపిస్తుందన్నారు. యర్రబంద, పి.కొట్నాబిల్లి,కె.కొట్నాబిల్లి, గదబపాలెం తదితర గ్రామాలకు చెందిన ప్రజలు రోడ్డు నిర్మాణ పనులు పూర్తయ్యేవరకు గ్రానైట్ లారీలు ఆపాలని క్వారీ యాజమాన్యాలను కోరినా పట్టించుకోలేదన్నారు.ఈ స్థితిలో ఆయా గ్రామాల ప్రజలు ఆందోళనకు సిద్ధంగా ఉన్నట్టు ఆయనహెచ్చరించారు.


కొట్నాబిల్లి నుంచి గ్రానైట్ రాయితో వస్తున్న లారీలు

విద్యార్థులకు ఆర్థిక సాయం

కె.కోటపాడు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విద్యలో రాణించాలని ఉల్లా సంస్థ ప్రతినిధి మహేశ్ తెలిపారు. గురువారం ఆయన మండలంలోని కొరువాడ జడ్పీ ఉన్నత పాఠశాలలో చదువులో ప్రతిభ చూపిన పది మంది విద్యార్థులకు రూ. వెయ్యి వంతున రూ. 10వేల ఆర్థిక సాయం అందించారు. దేశభక్తులు, పలువురు నాయకులు, ఉత్తమ క్రీడాకారుల చిత్రపటాలను సైడ్స్ ఐఎఫ్‌పీ ప్యానల్‌లో ప్రదర్శించారు. హెచ్ఎం కె. కమల కుమారి, ఉపాధ్యాయ సిబ్బంది ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఎస్సీల వివరాలతో జాబితాల ప్రదర్శన

చోడవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని అన్ని గ్రామ సచివాలయాల వద్ద ఎస్సీ సామాజిక వర్గాలకు చెందిన వారి జాబితాలను గురువారం అధికారులు ప్రదర్శనకు ఉంచారు. ఎస్సీ కేటగిరీకి సంబంధించిన ఉపకులాల వారీగా వివరాల సేకరణ కోసం ప్రభుత్వం ఆదేశాల మేరకు స్థానిక ఎంపీడీవో వీవీ ఎస్ .జే ఆంజేయులు ఆధ్వర్యంలో అధికారులు సచివాలయాల వద్ద ఈ జాబితాలను అందుబాటులో ఉంచారు. స్థానికంగా ఎస్సీ వర్గానికి చెందిన వారు ఈ జాబితాలను పరిశీలించి అభ్యంతరాలను ఈనెల 31లోగా వీ ఆర్వోలకు తెలియచేయాలని సూచించారు. తుది జాబితాలను జనవరి 10న వెలువరిస్తామని ఎంపీడీవో చెప్పారు.

మాడుగుల: మండలంలో 29 పంచాయతీల పరిధిలో ఉన్న గ్రామాల్లో గురువారంనుంచి షెడ్యూల్ కులానికి సంబంధించిన జాబితాను ప్రతీ గ్రామ సచివాలయాల్లో నోటీస్ బోర్డులో ప్రదర్శిస్తున్నట్టు ఎంపీడీవో కొంకి అప్పారావు తెలిపారు. వీటిలో అభ్యంతరాలు ఉంటే తెలపాలని కోరారు.

చౌడువాడలో...

కె.కోటపాడు: చౌడువాడలో సర్పంచ్ దాడి ఎరుకునాయుడు, ఎంపీటీసీ సభ్యులు ఏటుకూరి రాజేశ్, కార్యదర్శి సురేష్‌బాబు ఈ జాబితాను ఆవిష్కరించారు. పంచాయతీ పరిధిలో 267 ఎస్సీ కుటుంబాలు ఉన్నారని, వారి పూర్తి వివరాలు నమోదు చేస్తామన్నారు. గ్రామ పెద్దలు కుంచ అంజిబాబు, తనకల అప్పలనాయుడు (పట్టాలు), సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.


చౌడువాడలో ఎస్సీ కులగణన వివరాలను చూపుతున్న సర్పంచ్ దాడి ఎరుకునాయుడు

లక్ష్మమ్మ ఆలయంలో పూలంగిసేవ


పూజలు నిర్వహిస్తున్న భక్తులు

చోడవరం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని లక్ష్మమ్మ ఆలయంలో గురువారం మార్గశిర మాసం ఆఖరి గురువారం సందర్భంగా పూలంగి సేవ నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళలు పెద్ద సంఖ్యలో అమ్మవారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. తెల్లవారుజామునుంచే భక్తులు ఆలయానికి చేరుకొని చీరలు, పసుపు కుంకుమలు సమర్పించారు. ఈ సందర్భంగా ఆలయ కోశాధికారి నున్న గోపాలం ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

ఆలయానికి వెళ్లే రోడ్డుకు మోక్షం


పెదనందిపల్లిలో సత్యనారాయణమూర్తి గుడి రోడ్డు పనులు

దేవరాపల్లి, డిసెంబరు26 (ఆంధ్రజ్యోతి) మండలంలోని వీర వెంకట సత్యన్నారాయణమూర్తి గుడికి వెళ్లే రహదారికి మోక్షం కలిగింది. ఎన్నో ఏళ్లుగా అభివృద్ధికి నోచుకోని పెద నందిపల్లి సత్యన్నారాయణమూర్తి ఆలయానికి వెళ్లే రహదారికి కూటమి ప్రభుత్వం పుణ్యమా అని మోక్షం కలిగింది. మాజీ ఎంపీటీసీ కొరుప్రోలు రామలింగేశ్వరస్వామి చొరవతో ఈపనులు జరుగుతున్నాయి. మాజీ ఎంపీపీ కిలపర్తి భాస్కరరావు, చిననందిపల్లి సర్పంచ్ పూడి.సత్యారావు, దేవరాపల్లి ఎంపీటీసీ కృష్ణమూర్తి, అల్లు.శ్రీను పాల్గొన్నారు.

చెరువు గట్టుపై మొక్కలు పెంపకం


కనుములలో మొక్క నాటుతున్న దృశ్యం

మాడుగుల రూరల్, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని సాగరం కనుముల చెరువు గట్టుపై గురువారం ఉపాధి పథకం ద్వారా బ్లాక్ ప్లాంటేషన్ కార్యక్రమంలో భాగంగా కొబ్బరి మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టారు. 100 మొక్కలు నాటి వాటి సంరక్షణ చర్యలు చేపడతామని మాజీ సర్పంచ్ బుద్దాల రమణ, టీసంఘం అధ్యక్షులు, ఉపాధ్యక్షులు వియ్యపురాజు, సత్తిబాబు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ బుద్దాల రమణ, సీ ఎన్ఆర్ఈజీఎస్ టీసీ తూరిబిల్లి లక్ష్మీ, వీఆర్పీ అప్పలనాయుడు పాల్గొన్నారు.

కోడింగ్‌పై పట్టు చిక్కేలా!

విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న హ్యాక్ క్లబ్

» 13 నుంచి 19 ఏళ్లలోపు వయసున్న వారికి అవకాశం



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

(విశాఖపట్నం, ఆంధ్రజ్యోతి)

కోడింగ్ అంటే సాధారణంగా ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించిన అంశంగా అంతా భావిస్తారు. దీనిపై పట్టు ఉంటే మంచి ప్యాకేజీ వేతనాలు పొందవచ్చన్న భావన ఎంతోమందిలో ఉంది. ఈ భావనను తొలగించడంతోపాటు కోడింగ్ పట్ల అందరిలో ఆసక్తిని పెంపొందించేందుకు అమెరికాకు చెందిన జాస్ లట్టా హ్యాక్ క్లబ్ పేరుతో ఓ సంస్థను ప్రారంభించాడు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాల విద్యార్థులకు కోడింగ్‌పై అవగాహన కల్పించడంతో పాటు పట్టు సాధించేలా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

- అనేక దేశాల్లో పనిచేస్తున్న ఆర్గనైజేషన్
- విశాఖలోనూ జోరుగా కార్యక్రమాలు
- ఇటీవల కౌంటర్ స్పెల్ పేరుతో హ్యాకథాన్
- నాలుగు రకాల యాక్టివిటీస్ పరిచయం
- విద్యార్థుల్లో పెరుగుతున్న ఆసక్తి

ప్రపంచవ్యాప్తంగా అనేక దేశాల్లోని వందకుపైగా నగరాల్లో హ్యాక్ క్లబ్ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, విశాఖలోనూ జోరందుకున్నాయి. కొద్దిరోజులు కిందట శ్రీశారదా విద్యా నిలయంలో అత్యంత ప్రతిష్టాత్మకంగా కౌంటర్ స్పెల్ హ్యాకథాన్ ప్రోగ్రామ్‌ను నిర్వహించారు. ఇందులో అనేక పాఠశాలలకు చెందిన 50 మంది విద్యార్థులు పాల్గొన్నారు. హ్యాకథాన్ నిర్వహణ బాధ్యత సభ్యులుగా ఉన్న విద్యార్థులే చూసుకోవడం గమనార్హం.

ఆ భావన దూరం చేయాలనే...

కోడింగ్ అంటే ఇంజనీరింగ్ విద్యార్థులకు సంబంధించిన అంశం అన్న భావనను దూరం చేయాలన్న ఉద్దేశంతోనే హ్యాక్ క్లబ్‌ను ప్రారంభించారు. ప్రస్తుతం అనేక దేశాలకు చెందిన సుమారు లక్ష మంది విద్యార్థులు ఇందులో భాగస్వాములు. విశాఖకు చెందిన సుమారు వంద మంది ముందుకు సాగుతున్నారు. 13 ఏళ్ల నుంచి 19 ఏళ్లలోపు విద్యార్థులకు కోడింగ్ అం టే ఏమిటి..? ఎలా చేయాలన్న విషయాలను తెలియ జేయడంతోపాటు ఎందుకు కోడింగ్ చేస్తున్నారు, దానివల్ల ఏం జరుగుతుందనే విషయాలపై అవగాహన కల్పిస్తాం. అంతేకాదు కోడింగ్ చేసేందుకు హ్యాక్ క్లబ్ సహకారాన్ని అందిస్తుంది. ఇందుకోసం వర్చువల్‌గా హ్యాక్‌క్లబ్‌లో భాగస్వాములుగా ఉన్న నిపుణులు విద్యార్థులకు వాట్సాప్ తరహాలో స్లాక్ అనే మీడియాను వినియోగిస్తున్నారు.





ఆన్‌లైన్‌లో విద్యార్థులకు కోడింగ్‌పై శిక్షణ అందిస్తున్న దృశ్యం



ఇవీ యాక్టివిటీస్

హ్యాక్ క్లబ్ ఆధ్వర్యంలో ప్రపంచవ్యాప్తంగా పదుల సంఖ్యలో యాక్టివిటీస్ నిర్వహిస్తూ విద్యార్థులకు కోడింగ్ పట్ల ఆసక్తిని పెంపొందిస్తున్నారు. విశాఖలోని హ్యాక్ క్లబ్ ఆధ్వర్యంలో ఇప్పటి వరకు నాలుగు రకాల యాక్టివిటీస్‌ను నిర్వహించారు. ఇందులో మొదటిది హైసిస్. ఇందులో విద్యార్థులు తమ ఆలోచనలకు అనుగుణంగా ప్రాజెక్టులను డిజైన్ చేశారు. దానికి అనుగుణమైన సాఫ్ట్‌వేర్‌ను కోడింగ్ చేస్తారు. మంచి ప్రాజెక్ట్‌గా భావిస్తే వారికి హ్యాక్ క్లబ్ నుంచి రివా ర్డులను అందించి ప్రోత్సహిస్తారు. రెండోది కౌంటర్ స్పెల్. కొద్దిరోజుల కిందటే కౌంటర్ స్పెల్‌లో భాగంగా హ్యాకథాన్ నిర్వహించారు. ఇందులో భాగం గా వారికి ఇచ్చే కొన్నిరకాల ప్రోబ్లమ్స్‌ను పిల్లలు గ్రూపులుగా విడిపోయి కోడింగ్ ద్వారా సబ్‌మిట్ చేస్తారు. ఇందులో విజేతలకు బహుమతులను అందిస్తారు. మూడో యాక్టివిటీ స్ప్రింగ్ కన్సోల్. ఇందులో తమకు నచ్చిన గేమ్స్‌ను కోడింగ్ ద్వారా డిజైన్ చేయవచ్చు. కోడింగ్ కరెక్ట్‌గా ఉంటే అందుకు అనుగుణమైన పరికరాలను తయారుచేసి పంపిస్తారు. ఈ పార్టులను ఏకంచేసి గేమింగ్ పరికరాన్ని రూపొందిస్తారు. నాలుగోది ఆన్‌బోర్డు. ఇందులో ఎలక్ట్రానిక్ సర్క్యూట్‌ను విద్యార్థులు డిజైన్ చేస్తారు. కంప్యూటర్‌లో వారి ఆలోచనలకు అనుగుణంగా డిజైన్ చేసి, పనితీరుకు సంబంధించిన కోడింగ్ పంపిస్తారు. ఈ ఎలక్ట్రానిక్ సర్క్యూట్స్‌ను ఉత్పత్తిచేసి అమెరికాలోని కేంద్ర కార్యాలయం నుంచి పంపిస్తారు. వీటిలో ఏసీటూ డీసీ కన్వర్టర్స్, ఆఫీసుల్లోకి ఎంట్రీ ఇచ్చేందుకు వినియోగిస్తున్న కార్డ్స్, యూఎస్‌బీ తయారుచేసేలా గైడెన్స్ ఇస్తున్నారు. వీటితోపాటు కోడింగ్ ద్వారా ఎటువంటి యాక్టివిటీస్ చేయవచ్చు అనే అంశాలపైనా అవగాహన కల్పిస్తున్నారు.

ఎలాన్ మస్క్ చేయూత..

హ్యాక్ క్లబ్‌కు ప్రపంచ ప్రఖ్యాత టెస్లా సంస్థ అధినేత ఎలాన్ మస్క్ సుమారు రూ.40 కోట్ల సాయాన్ని అందించారు. విద్యార్థుల్లోని విభిన్న ఆలోచనలను ప్రోత్సహించి వెలికితీసే విధానాన్ని ప్రోత్సహిస్తున్నారు. డెల్ టెక్నాలజీస్‌తోపాటు మరిన్ని దిగ్గజ సంస్థలు రెండు నుంచి ఐదు మిలియన్ డాలర్ల సాయాన్ని అందించాయి.

వ్యవసాయం, విద్య, ఉపాధి రంగాలకు విరివిగా రుణాలు ఇవ్వాలి

» కలెక్టర్ విజయకృష్ణన్ ఆదేశం



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ విజయకృష్ణన్

అనకాపల్లి కలెక్టరేట్, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): బ్యాంకులు వ్యవసాయ, విద్యా, ఉపాధి రంగాలకు లక్ష్యాలకు మించి రుణాలు అందించాలని కలెక్టర్ విజయ కృష్ణన్ తెలిపారు. గురువారం కలెక్టరేట్ సమావేశమందిరంలో నిర్వహించిన డీసీసీ, డీఎల్ఆర్‌సీ త్రైమాసిక సమావేశంలో కలెక్టర్ విజయకృష్ణన్ పాల్గొని మాట్లాడారు. కౌలు రైతులకు కూడా వ్యవసాయ రుణాలు అందించాలని, ఇ-క్రాప్ ఆధారంగా వ్యవసాయ రుణాలు మంజూరు చేయాలన్నారు. వ్యవసాయ అనుబంధ రంగాలకు రుణాలు అందించాలని తెలిపారు. ఉన్నత విద్యను అభ్యసించడానికి విద్యా రుణాలు అందించాలని, కళాశాలల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించి అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. రుణమేళాలు నిర్వహించి రుణాలు మంజూరు చేయాలని ఆమె సూచించారు. నిరర్థక ఖాతాలలో గల డబ్బులను సంబంధికులను గుర్తించి అందజేయాలని తెలిపారు. సదరు ఖాతాదారులను గుర్తించడానికి డీఆర్‌డీఏ, మెప్మా సిబ్బంది సహకారం తీసుకోవాలని ఆదేశించారు. తోటలు, కూరగాయలు, పశు సంవర్ధక, డెయిరీ, మత్స్య పరిశ్రమలలో కాలానుగుణంగా ఉత్పత్తి సాధించే రంగాలకు ఆర్థిక చేయూతనివ్వాలన్నారు. ఆయా శాఖల అధికారులు, బ్యాంకు అధికారులు సమన్వయంతో వ్యవసాయ, అనుబంధ రంగ రైతులను ప్రోత్సహించాలన్నారు. బ్యాంకులు, నైపుణ్యాభివృద్ధి సంస్థల ద్వారా అందిస్తున్న నైపుణ్య శిక్షణ జిల్లాలో గల ఫార్మా కంపెనీలలో గల ఉద్యోగాలకు అవసరమైన అంశాలలో అందించాలని తెలిపారు. జిల్లాలో ఉత్పత్తి అవుతున్న వస్తువులకు బ్రాండింగ్, మార్కెటింగ్ సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో మాడుగుల ఎమ్మెల్యే బండారు సత్య నారాయణమూర్తి, బ్యాంకర్లు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

పలాస, విజయనగరం మెము రైళ్లు పునరుద్ధరణ

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): పలాస, విజయనగరం మెము రైళ్లను పునరుద్ధరించామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. అలాగే విశాఖ, విజయనగరం మధ్య రైలు సర్వీసులను తాత్కాలికంగా పార్వతీపురం వరకు పొడిగించామన్నారు. విశాఖ-పలాస మెము పాసింజర్ ఈనెల 28 నుంచి మార్చి ఒకటి వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. పలాస-విశాఖ మెము పాసింజర్ ఈనెల 28 నుంచి మార్చి ఒకటి వరకు ప్రతి శుక్ర, శనివారాల్లో మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విశాఖ-విజయనగరం మెము పాసింజర్‌ను పార్వతీపురం వరకు పొడిగించారు. ఈనెల 27 నుంచి ఫిబ్రవరి 28 వరకు గురువారం మినహా మిగిలిన రోజుల్లో అందుబాటులో ఉంటుంది. విజయనగరం-విశాఖ పాసింజర్ ఈనెల 28 నుంచి మార్చి ఒకటి వరకు శుక్రవారం మినహా పార్వతీపురంలో బయలుదేరి విశాఖ చేరుతుంది.

రేషన్ డిపో డీలర్ల నియామకానికి ముగిసిన పరీక్ష



పరీక్షా కేంద్రం వద్ద ఆర్డీవో రమణతో మాట్లాడుతున్న జేసీ జాహ్నవి

నర్సీపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): అనకాపల్లి, నర్సీపట్నంలో గురువారం నిర్వహించిన రేషన్ డిపో డీలర్ల నియామక రాత పరీక్ష ప్రశాంతంగా జరిగిందని జాయింట్ కలెక్టర్ ఎం.జాహ్నవి చెప్పారు. రేషన్ డీలర్ల నియామక రాత పరీక్ష జరుగుతున్న పెదబొడ్డేపల్లిలోని డాన్ బాస్కో కళాశాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ, నర్సీపట్నం డివిజన్‌లో కొత్తగా ఏర్పాటు చేయనున్న 14 రేషన్ డిపోలతోపాటు వివిధ కారణాల వల్ల 37 రేషన్ డిపోల డీలర్ పోస్టులు ఖాళీగా వున్నాయని చెప్పారు. అయితే ఖాళీలు ఏర్పడిన 37 దుకాణాలకు మాత్రమే రాత పరీక్ష నిర్వహించామని, మొత్తం 109 మంది దరఖాస్తు చేసుకోగా 100 మంది పరీక్షకు హాజరయ్యారు. అనకాపల్లి డివిజన్‌లో 60 రేషన్ డిపోలకు ఖాళీలు ఏర్పడగా, 46 దుకాణాలకు దరఖాస్తులు ఆహ్వానించామన్నారు. మొత్తం 166 మంది దరఖాస్తు చేసుకోగా 164 మంది పరీక్షకు హాజరయ్యారని జేసీ తెలిపారు. ఆమె వెంట ఆర్డీవో వీవీ రమణ, ఇతర అధికారులు వున్నారు.

అమృతసర్ ఎక్స్‌ప్రెస్‌కు అదనపు కోచ్

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): విశాఖ, అమృతసర్ మధ్య నడుస్తున్న హిరాకుడ్ ఎక్స్‌ప్రెస్ రైళ్లకు అదనంగా తాత్కాలిక స్లీపర్ క్లాసు కోచ్ జత చేస్తున్నామని సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖ-అమృతసర్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 27 నుంచి, అమృతసర్-విశాఖ ఎక్స్ ప్రెస్ రైలుకు 29 నుంచి అందుబాటులో ఉంటుందన్నారు.

చికెన్ ధరలు

బ్యాగ్	రూ.లలో
రైతు ధర	100.00
లైవ్ ధర	125.00
విత్ స్కిన్	210.00
స్కిన్ లెస్	220.00

కోడి గుడ్లు (నెక్)

వంద గుడ్లు	రూ.లలో
విశాఖపట్నం	600
విజయనగరం	604
శ్రీకాకుళం	604

సప్పరం వాహనంపై సప్త గిరీశుడు

నక్కపల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉపమాక క్షేత్రం మార్గశిర మాసం కృష్ణ పక్షం ఏకాదశి సందర్భంగా గురువారం ఉదయం నుంచి భక్తులతో కిటకిటలాడింది. తెల్లవారుజామున కొండపై వున్న స్వామివారి నిజరూపానికి ఆలయ అర్చకులు కృష్ణమాచార్యులు పంచామృతాభిషేకం చేసి, ధూప, దీప నైవేద్య నీరాజన మంత్రపుష్పాలు సమర్పించారు. కింద ఆలయంలో క్షేత్రపాలకుడు వేణుగోపాలస్వామికి ప్రధానార్చకులు ప్రసాదాచార్యులు, అర్చకులు శేషాచార్యులు, సాయి గోపాలాచార్యులు, శ్రీనివాసాచార్యులు, నండూరి గోపాలాచార్యులు పూజలు, నిత్య హోమాలు చేశారు. తదుపరి సప్పరం వాహనంపై ఉభయ దేవేరులతో కూడిన వేంకటేశ్వర స్వామి, పల్లకీలో గోదాదేవి అమ్మవారి ఉత్సవమూర్తిని అలంకరించి మాడవీధుల్లో తిరువీధి సేవ నిర్వహించారు.



మాడవీధుల్లో స్వామివారి తిరువీధి సేవ



సప్పరం వాహనంపై భక్తులకు దర్శనమిస్తున్న స్వామి

అనంతరం ఆలయంలో తిరుప్పావై పాశుర విన్నపం చేశారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఇన్‌స్పెక్టర్ కూర్మేశ్వర రావు, పవన్‌కుమార్, జ్ఞాన ప్రమోద్, సింగరాచార్యులు, తాతాజీ కృష్ణ ప్రసాద్ పాల్గొన్నారు.

గంగమ్మతల్లికి మత్స్యకారుల పూజలు



పెదజాలారిపేట తీరానికి చేరుకున్న మత్స్యకారులు



గంగమ్మకు పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెలగపూడి

విశాఖపట్నం, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): గంగమ్మతల్లీ చల్లగా చూడమ్మా అంటూ మత్స్యకార మహిళలు వేడుకున్నారు. 2004 డిసెంబరు 26న వచ్చిన సునామీ లాంటి భయంకర విపత్తులు మళ్లీ సంభవించకుండా చూడాలని కోరుకుంటూ ఆ మరుసటి ఏడాది నుంచి ఇలా పూజలు చేయడం ఆనవాయితీగా వస్తోం ది. ఇందులో భాగంగా మత్స్యకారులంతా గురువారం కలశాలతో ఊరేగింపుగా పెదజాలారిపేట బీచ్‌కు చేరుకుని సంద్రానికి పూజలు చేశారు. వేలాదిమంది మహిళలు నీళ్లు, పాలు, పసుపు నీటిని కలశాలతో నింపి శిరస్సున దాల్చి తీరానికి చేరుకున్నారు. కలశాల్లోని నీరు, పాలతో సముద్రానికి అభిషేకాలు నిర్వహించి, ప్రత్యేక పూజలు చేశారు. గంగమ్మతల్లీ మరోసారి కన్నెర్ర చేయకమ్మా అని వేడుకున్నారు. పెదజాలారిపేట గాంధీ బొమ్మ సెంటర్ నుంచి వేలాదిమంది మహిళలు శిరసున దాల్చిన కలశాలతో ఊరేగింపుగా తీరానికి చేరుకున్నా రు. తమకు సముద్రమే జీవనాధారమని, ఆగ్రహించకుండా అనుగ్రహం చూపాలని కోరుకున్నారు. వేలాదిగా బీచ్‌కు చేరుకోవడంతో తీరం జన సంద్రమయింది. మత్స్యకార గ్రామ పెద్దల ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న తూర్పు ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు గంగమ్మకు పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో 19వ వార్డు కార్పొరేటర్ నొల్లి నూకరత్న, టీడీపీ నేత బైరెడ్డి పోతన్నరెడ్డి, తెడ్డు పరసన్న, తెడ్డు శతయ్య, తెడ్డు రాజు, బాపిరాజు, తెడ్డు పోలారావు, రమోలు వీరాజు, తేజ, పోలీసు, మత్స్యకార పెద్దలు, మహిళలు పాల్గొన్నారు.



గంగమ్మకు పూజలు చేస్తున్న మహిళలు

జల్‌జీవన్ మిషన్ పనులు వేగవంతం చేయాలి

» అరకులోయ ఎంపీ తనూజారాణి

పాడేరు, డిసెంబరు 26 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో జల్‌జీవన్ మిషన్ పనులను వేగవంతం చేసి ఇంటింటా నీటి కుళాయిలను ఏర్పాటు చేయాలని అరకులోయ పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ జి.తనూజరాణి అన్నారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన జిల్లా అభివృద్ధి సమన్వయ, పర్యవేక్షణ కమిటీ(దిశా) సమావేశంలో ఆమె చైర్మన్ హోదాలో పాల్గొని మాట్లాడారు. ప్రధానంగా కేంద్ర ప్రభుత్వం అందిస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. జల్‌జీవన్ మిషన్‌లో భాగంగా జిల్లాకు రూ.300 కోట్లు మంజూరయ్యాయని, వాటితో 4,547 పనులు జరగాల్సి ఉండగా, ఇప్పటికి 3,362 పనులు మాత్రమే జరిగాయన్నారు. మిలిగిన పనులను వేగవంతం చేసి ఇంటింటికీ కుళాయిలతో నీటిని అందించాలన్నారు. జిల్లాలో మొత్తం 2,38,319 ఇళ్లకు గానూ ప్రస్తుతం 1,20,0931 ఇళ్లకు మాత్రమే జల్‌జీవన్ మిషన్‌లో నీటి కుళాయిలు ఏర్పాటు చేశారని, ఇంకా 1,17,388 ఇళ్లకు నీటి కుళాయిలను ఏర్పాటు చేయాలన్నారు.

జిల్లాలో నైపుణ్యాభివృద్ధి ద్వారా గిరిజన నిరుద్యోగులకు, యువతకు అవసరమైన స్వయం ఉపాధి శిక్షణలు అం దించి వారికి స్వయం ఉపాధి కల్పించాన్నారు. అలాగే సికిల్ సెల్ ఎనీమియా నిర్మూలనకు కృషి చేయాలని, జిల్లాలో 4 లక్షల 45 వేల మంది రక్తపరీక్షలు నిర్వహిస్తే, 1172 మందికి సికిల్‌సెల్ ఎనీమియా ఉన్నట్టు నిర్ధారణ అయిందన్నారు. వారందరికీ నెలా నెలా పెన్షన్ అందేలా అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. విద్యుత్ రూఫ్‌టాప్ సోలార్ యూనిట్లపై వినియోగదారులకు అవగాహన కల్పించాలని, హౌసింగ్ స్కీముల్లో ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయాలన్నారు. అలాగే జాతీయ ఉపాధి హామీ పనుల్లో జిల్లాకు ప్రథమ స్థానం లభించడం అభినందనీయమని, ఈ ఏడాది రూ.250 కోట్ల పనులు లక్ష్యం కాగా, రూ.304 కోట్ల పనులు చేశారని తెలిపారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు, ఘాట్‌లో జంగిల్ క్లియరెన్స్‌కు, కొండచరియలు విరిగిపడకుండా చర్యలు చేపట్టాలన్నారు. ఈ సందర్భంగా విద్యుత్ శాఖ రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్‌పై రూపొందించిన పోస్టర్‌ను ఎంపీ, అధికారులు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో కలెక్టర్ ఏఎస్.దినేశ్‌కుమార్, జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, పాడేరు, అరకులోయ ఎమ్మెల్యేలు ఎం.విశ్వేశ్వరాజు, ఆర్.మత్స్యలింగం, పాడేరు, రంపచోడవరం, చింతూరు ఐటీడీఏ పీవోలు వి.అభిషేక్, కె.సింహాచలం, అపూర్వభరత్, పలువురు ఎంపీపీలు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

క్రైం... crime news

గొరపూడి ఎంపీపీ స్కూల్‌లో చోరీ



గొరపూడి ఎంపీపీ స్కూల్లో రికార్డులు, సామగ్రిని చెల్లాచెదురుగా పడేసిన దృశ్యం

రాంబిల్లి, డిసెంబరు 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గొరపూడి ఎంపీపీ స్కూల్‌లో చోరీ జరిగిందని మండల విద్యాశాఖాధికారి ఎం.సూర్యారావు తెలిపారు. ఈ నెల 24, 25 తేదీల్లో పాఠశాలకు సెలవులు కావడంతో దొంగలు పాఠశాల గది తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారన్నారు. గురువారం ఉపాధ్యాయులు పాఠశాలకు వచ్చి చూసేసరికి పాఠశాల గది చిందరవందరగా తయారై ఉందన్నారు. పాఠశాలలోని రికార్డులు చెల్లాచెదురుగా పడి ఉన్నాయని, సుమారు 40 కోడిగుడ్లు చోరీకి గురైనట్టు ఉపాధ్యా యులు తనకు తెలియజేశారన్నారు. దీనిపై రాంబిల్లి పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు ఆయన తెలిపారు.

అడుగడుగునా గోతులే!

... 5వ పేజీ తరువాయి

వుండేది. అప్పట్లో తారు రోడ్డుగా అభివృద్ధి చేశారు. పంచాయతీరాజ్ శాఖ ఆధీనంలో వున్న ఈ రహదారిని గత వైసీపీ ప్రభుత్వం రోడ్లు, భవనాల శాఖ పరిధిలోకి తీసుకువచ్చింది. ఏటా నిర్వహణ పనులు చేపట్టకపోవడంతో క్రమంగా గోతులు ఏర్పడడం మొదలైంది. క్వారీ లారీలు, సరుగుడు కర్రలను రవాణా చేసే భారీ వాహనాలు ఈ మార్గంలో రాకపోకలు సాగిస్తుండడంతో భారీ గోతులు ఏర్పడ్డాయి. వైసీపీ ఐదేళ్ల పాలనలో గోతులను పూడ్చకపోవడంతో మరింత పెరిగిపోయి పంట కుంటల్లా మారాయి. రావికమతం నుంచి సుమారు 20 కిలోమీటర్ల దూరంలో వున్న కన్నూరుపాలెం జంక్షన్‌కు చేరుకోవడానికి గంట సమయం పడుతున్నదని ద్విచక్ర వాహనదారులు, ఆటో డ్రైవర్లు చెబుతున్నారు. అత్యవసర వైద్య సేవల కోసం రోగులను, నెలలు నిండిన గర్భిణులను సకాలంలో ఆస్పత్రికి తీసుకెళ్లడానికి పలు గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రహదారిని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయకపోయినా.. కనీసం గోతులు అయినా పూడ్చాలని ఆయా గ్రామాల ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా రావికమతం- కన్నూరుపాలెం రోడ్డు దుస్థితి గురించి ఆర్అండ్‌బీ జేఈ సాయి శ్రీనివాస్ వద్ద ప్రస్తావించగా, రోడ్డు అభివృద్ధికి రూ.3 కోట్లు అవసరమని ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపామని, ఆమోదం లభించిన వెంటనే పనులు చేపడతామని చెప్పారు.



తట్టబంద వద్ద రోడ్డుపై భారీ గొయ్యి

జనవరి 31 నుంచి అరకు ఉత్సవాలు

... 5వ పేజీ తరువాయి

చెప్పారు. అరకు, మారేడుమిల్లి ఉత్సవాల నేపథ్యంలో ఆయా పర్యాటక ప్రదేశాలను ప్లాస్టిక్‌రహితంగా మార్చాలన్నారు. అరకులోయ, బొర్రా గుహలు ప్రాంతాల్లో ప్లాస్టిక్ విక్రయం, వినియోగం లేకుండా తగు చర్యలు చేపట్టాలన్నారు. ప్లాస్టిక్ నీళ్ల సీసాలను సైతం నిషేధిస్తున్నామని, దీనిని పక్కాగా అమలు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ డాక్టర్ ఎంజే.అభిషేక్‌గౌడ, ఐటీడీఏ పీవో వి.అభిషేక్, డీఆర్వో పద్మలత, జిల్లా పర్యాటకాధికారి జి.దాసు పాల్గొన్నారు.

మైదాన ప్రాంతంలోనూ డోలీ మోతలు!

... 5వ పేజీ తరువాయి

మొబైల్ ఫోన్ టార్చి లైట్ల వెలుగులో వెంకటలక్ష్మిని సుమారు కిలోమీటరు దూరంలో వున్న ఉన్న రావిపాలెం గ్రామానికి చేర్చారు. అక్కడ నుంచి ఆటోలో మాడుగుల సీహెచ్‌సీకి తీసు కొచ్చారు. డాక్టర్లు సేవలు అందించి సాధారణ ప్రసవం చేశారు. తల్లీబిడ్డ ఆరోగ్యం గానే ఉన్నారు.